J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 36 10.02.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# రాజకీయ చట్రంలో రాజధాని

**విశాఖే రాజధాని** - రాష్ట్రం

**రాజధాని అమరావతే** - కేంద్రం

**మేం జోక్యం చేసుకోం** - న్యాయవ్యవస్థ

రాష్ట్రం, కేంద్రం, న్యాయస్థానాల **దోబూచులాట**

ఒక్కొక్కరిది ఒక్కొక్క పాట **భావోద్వేగాలతో ఆట**

ప్రజలు, పరిశ్రమలు, పెట్టుబడులు **వలసబాట**



స్వార్థపూరిత రాజకీయ వికృత క్రీడలో భాగంగా సుభిక్ష, సంతోష, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముక్కలై మరో నాలుగు నెలలకి 9 సంవత్సరాలు పూర్తవుతుంది. 2013 డిసెంబర్ 9వ తేదీ అప్పటి కాంగ్రెస్ అధినేత్రి, ఇటలీ దొరసాని సోనియమ్మ తొలిసారిగా ప్రత్యేక తెలంగాణని ప్రకటించింది. అక్కడినుండే ఆంధ్రకి గడ్డురోజులు ప్రారంభమయ్యాయి. 2014 జూన్ 2వతేది ప్రత్యేక కొత్త రాష్ట్రంగా తెలంగాణ సంపూర్ణంగా ఏర్పడింది. కానీ, నిజానికి కొత్త రాష్ట్రంగా అవతరించింది ఆంధ్రప్రదేశ్. రాష్ట్ర విభజనలో అనాధగా మారి, అగాధానికి వెళ్ళిపోయింది ఆంధ్ర ప్రాంతం. వడ్డించిన విస్తరిలా ఉన్న హైదరాబాదు నగరం తెలంగాణలోకి వెళ్లిపోవడంతో ఆంధ్ర ప్రజానీకం ముందు ఆంధ్ర రాష్ట్రం దీనంగా నిలబడిపోయింది. అక్కడినుండే ఆంధ్రాకి కష్టాలు మొదలయ్యాయి.

10లో

# ఆదాల కోట వైపు.. కోటంరెడ్డి కోటరీ!



- మేము జగన్‌తోనే అంటున్న నాయకులు
- పార్టీయే ప్రధానం.. వ్యక్తులు కాదంటున్న కార్యకర్తలు
- ఖాళీ అవుతున్న శ్రీధర్ శిబిరం
- లంకా ప్రకటనతో అబాసుపాలైపోయిన ఎమ్మెల్యే
- నాగసాధు శ్రీధర్‌తో ఏం చెప్పాడు?

వైసీపీ కంచుకోట నెల్లూరుజిల్లాలో ఒక్కసారిగా రాజకీయం మారిపోయింది. 10రోజుల క్రితంవరకు ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతలలో ఒకడిగా వ్యవహరిస్తుండిన రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని, ఇప్పుడు అదే పార్టీ వాళ్ళు కీతాగా చూసే పరిస్థితి ఏర్పడింది. తన ఫోన్‌ని రాష్ట్రప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూ ఆరోపించి శ్రీధర్ అధికార పార్టీని వీడడం, వెంటనే అధిష్టానం ఆదాల ప్రభాకరరెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించడం తెలిసిందే. అయితే ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం ఆదాల ప్రభాకరరెడ్డి నెల్లూరులో అడుగుపెట్టినప్పటినుండి రాజకీయం రసవత్తరంగా మారింది. రేణిగుంట విమానాశ్రయం నుండే ఆదాలకు ఘనస్వాగతం లభించింది. ఆదాలకు వేలాదిమంది కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆయనను స్వాగతించడం కోసం వెళ్లిన వారిలో కోటంరెడ్డి అనుచరగణం కూడా ఉన్నారు. ఆదాల నెల్లూరులో అడుగుపెట్టినప్పటినుండి రోజుకొక పరిణామం చోటు చేసుకుంటోంది.



10లో





# గళమెత్తి గర్జించిన..అంగన్‌వాడీలు

## సమస్యలు తీర్చాలంటూ.. కలెక్టరేట్ వద్ద ఆందోళన


అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలంటూ జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రమైన నెల్లూరుకు వచ్చిన వేలాదిమంది అంగన్‌వాడీలు ఈనెల 6న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ నగరంలోని వి.ఆర్.సి కూడలి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. అంగన్‌వాడీలుగా ఎంతోకాలం నుంచి పనిచేస్తున్న తమకు కనీస వేతనాలివ్వాలంటూ గళమెత్తి గర్జించారు. సిఎం జగన్ గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ముఖ హాజరు (ఫేస్ యాప్)ను రద్దుచేయాలన్నారు. నిరుపేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అనునిత్యం సేవలందిస్తున్న తమకు కనీస వేతనాలు లేవని, గత కొంతకాలంగా ప్రభుత్వం టిఏ, డీఏలు కూడా చెల్లించడం లేదని, సమస్యలు తీర్చకపోగా తనిఖీలపేరుతో అంగన్ వాడీ కార్యకర్తలను, సిబ్బందిని వేధిస్తున్నారని అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్ళు కె.సుబ్బరావమ్మ, వై.సుజాతమ్మ, జి.బేబీరాణి, ఎస్‌కె రెహానాబేగమ్ తదితరులు వాపోయారు. అనేక అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదని, ఆ సౌకర్యం ఉన్న కేంద్రాలకు సంబంధించిన విద్యుత్‌బిల్లులను సకాలంలో చెల్లించడం లేదని వారు తెలిపారు. అంగన్‌వాడీలకు నెలకు కనీసం 26వేల రూపాయలు వేతనంగా ఇవ్వాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను వెంటనే చెల్లించాలని, వంటలు వండేందుకు గ్యాస్‌ను ప్రభుత్వమే పంపిణీ చేయాలన్నారు. సుప్రీమ్‌కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని వారు కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# జిల్లాలో పుష్కలంగా ఎరువులు

**-వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు**

జిల్లాలో ఎరువులకు కొరత లేదని, ఈ సీజన్‌కు రైతులకు అవసరమైన ఎరువులు పుష్కలంగా వచ్చాయని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు తెలిపారు. 59,129 టన్నుల యూరియా, 27వేల టన్నుల డిఏపి, 51వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 3300 టన్నుల ఎంఓపి ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, అధీకృత ఎరువుల డీలర్లు, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను అందజేస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కళాత్మక చిత్ర దర్శకునికి.. వందనం



ప్రేక్షకులలో సంస్కృతి ఉషస్సుకై
(సం)చలన చిత్రాలను తపస్సులా
రూపొందించి అందించిన మనస్సు మీద
అందుకే మాయని మహా యశస్సు మీకు...
జీవన గమనంలో స్థూలంగా చరిస్తూ
సమాజ సంస్కరణ సూక్ష్మంగా చూపిస్తూ
పరివర్తన దీక్ష గల లక్ష్యం మీద
అందుకే వీక్షకులందరి సాక్ష్యం మీకు...
సంఘ గంగలో కాలుష్యం మాపాలని
మనుషుల్లోని వైషమ్యం ఆపాలని
ఆదర్శాల్ని దర్శించిన ఆవేదన మీద
అందుకే అశేషమైన ఆరాధన మీకు...
అసభ్యత, అశ్లీలతలకు దూరంగా
ఆచార వ్యవహారాలకు దగ్గరగా
అనుబంధాన్ని పండించిన మార్గం మీద
అందుకే అభినందనల స్వర్గం మీకు...
ప్రతిభా పాటవాలకు శేముషినిస్తూ
ప్రీతిగా ఆర్తిగా ఋషిలా కృషి చేస్తూ
మౌనగానంతో వినిపించిన గీతి మీద
అద్భుత అపూర్వ చిత్రాల ఖ్యాతి మీద...
కె.విశ్వనాథ్ అంటేనే కళాత్మకత
అనే పేరును శాశ్వతం చేసుకున్న
మీ ఘనతకు.. మీ విజ్ఞతకు మా వందనం.

**- బొగ్గరపు రాధాకృష్ణమూర్తి**
**నెల్లూరు. సెల్. 7981283747.**

## ఎస్ఎల్‌వి-డి2
# ప్రయోగానికి సిద్ధం!



ఎస్ఎల్‌వి-డి2 (స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఫిబ్రవరి 10వ తేది ఉదయం శ్రీహరి కోట, షార్‌లో ఉన్న మొదటి ప్రయోగ వేదికపై నుంచి రాకెట్‌ను ఆరోజు ఉదయం 9.18 గంటలకు ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఇ.ఒ.ఎస్-07) అనే ఉపగ్రహంతో పాటు, మరో రెండు చిన్నతరహా ఉపగ్రహాలను కూడా నింగిలోకి పంపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## తలుపూరుపాడు
# పోలేరమ్మగుడిలో చోరీ

సంగం మండలం తలుపూరుపాడు పోలేరమ్మ ఆలయంలో ఈనెల 6న చోరీ జరిగింది. దొంగలు గేటు తాళం పగల గొట్టి ఆలయం లోపలకి వెళ్ళి బీరువా తెరచి 250 గ్రాముల వెండిపట్టీలు, గంట అపహరించారు. హుండీ కూడా పగల గొట్టి సుమారు రూ.25వేలు దొంగిలించుకుపోయారు. గ్రామస్తుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్తగుంట..
# స్మశానాన్ని బాగుచేయండి

వెంకటాచలం మండలం సర్వేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తగుంట స్మశానం ఎంతోకాలంగా మురుగునీటి మడుగులా తయారైందని, కంపచెట్లు విపరీతంగా మొలిచి స్మశానానికి వెళ్ళే దారి మూసుకుపోయిందని, అధికారులు స్పందించి ఈ స్మశానాన్ని బాగుచేయించాలని సర్వేపల్లి జనసేన నాయకుడు బి.సురేష్ నాయుడు అధికారులకు విజ్ఞప్తిచేశారు.

# బాలికలకు చట్టాలపై అవగాహన

జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ ఆధ్వర్యంలో ఈనెల 6న ముత్తుకూరులోని డా.బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'భేటీ బచావో, భేటీ పడావో' పథకాలను వారికి వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇ-క్రాప్‌పై జేసీ పరిశీలన

మర్రిపాడు మండలంలోని పొంగూరు గ్రామంలో ఈనెల 6న జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఆకస్మిక తనిఖీలు చేసి ఇ-క్రాప్ చేసిన పొలాలను పరిశీలించారు. మోటార్‌బైక్‌లో ఆయన పొలాల్లోకి వెళ్ళి నేరుగా రైతులతో మాట్లాడి ఇ-క్రాప్ నామమాత్రంగా జరిగిందా లేక పటిష్టంగా చేశారా!..అనే అంశంపై తహశీల్దార్ హేమంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు.



# క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన అవసరం

## ముందుగానే గుర్తిస్తే..చికిత్స సులభం

**- అపోలో ఆసుపత్రి వైద్యుల వెల్లడి**

క్యాన్సర్ వ్యాధి విషయంలో ప్రజల్లో అవగాహన మరింత పెరగాల్సిన అవసరం ఉందని, అవగాహన-సత్వర చికిత్సలతో క్యాన్సర్‌ను దూరం చేసుకోవచ్చని నెల్లూరులోని అపోలో ఆసుపత్రి వైద్యులు చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, సీనియర్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ హరిత, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మనిభిరామ్‌లు మాట్లాడారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 4వతేదీని క్యాన్సర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందని తెలిపారు. 2022 సంవత్సరంలో దేశంలో 20 లక్షల క్యాన్సర్ కేసులు నమోదైనట్లు తెలిపారు. పొగతాగడం, పొగాకు నమలడం, మద్యం సేవించడం, అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వాయుకాలుష్యం తదితర అంశాలు క్యాన్సర్ వచ్చేందుకు కారణమవుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడంవల్ల ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మనం నిత్యం తినే ఆహారంలో కాయగూరలు ఉండాలని, బరువు పెరగకుండా చూసుకోవాలని, ప్రతిరోజు వ్యాయామం చేయడం, పొగాకు, మద్యానికి దూరంగా ఉండడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, కాలుష్యమైన గాలికి, నీటికి దూరంగా ఉండటం వల్ల క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చునని సూచించారు.

## ఉదయగిరి, సిద్ధేశ్వర క్షేత్రాల
# అభివృద్ధికి నిధులొచ్చాయ్

- **రూ. 8 కోట్లు మంజూరయ్యాయన్న అధికారులు**



జిల్లాలోని ఉదయగిరి దుర్గంతో పాటు, సిద్ధేశ్వర శైవక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం 8 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతుందని గుంటూరు రేంజ్ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ వై.శ్రీనివాసులు చెప్పారు. ఈనెల 6న ఆయన జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్‌తో, స్క్వాడ్ డిఎఫ్ఓ మారుతిప్రసాద్‌తో కలసి ఉదయగిరి దుర్గాన్ని, సిద్ధేశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయగిరి అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉదయగిరి దుర్గం అభివృద్ధికి 4 కోట్ల రూపాయలు, సిద్ధేశ్వరాలయాల అభివృద్ధికి మరో 4 కోట్ల వంతున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. ఈ సమావేశంలో ఉదయగిరి రేంజ్ అటవీ అధికారి తుమ్మల ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లకు.. 5 లక్షలివ్వాలి

- **వ్యవసాయ కార్మిక సంఘం నాయకుని డిమాండ్**

టిడ్కో ఇళ్ళకు కనీసం 5 లక్షల రూపాయలైనా కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ కోరారు. ఈనెల 6న ఆయన నెల్లూరులో సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇల్లు కట్టుకునేందుకు లబ్ధిదారులకు ఇప్పుడు ఇస్తున్న 1.8 లక్షలు చాలవన్నారు. పేదలకు ప్రభుత్వం ఈ పథకం కింద అరసెంటు స్థలం కేటాయించడం, అందులో 1.80 లక్షలతో ఇల్లు కట్టుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇళ్ళ కట్టుబడికి ఆ మొత్తం చాలని, కనుక వెంటనే ఆ మొత్తాన్ని పెంచాలని చెప్పారు. ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన ఇటుక, ఇనుము, సిమెంట్ వగైరాలను ప్రభుత్వం ఉచితంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు సమకూర్చాలని, టిడ్కో ఇళ్ళు, జగనన్న కాలనీల్లో నెలకొన్న సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా అధ్యక్షులు దామా అంకయ్య, నాయకులు సయ్యద్ సిరాజ్, ఎన్.రమణయ్య, షానవాజ్, మున్వర్, ఆనంద్, మున్నా, గౌస్, మధు, విజయకుమార్ పాల్గొన్నారు.

# నైతికతను కోల్పోతున్న రాజకీయ పార్టీలు

## కోటంరెడ్డి ఉదంతమే ఉదాహరణ!

ఈమధ్య నెల్లూరులో జరుగుతున్న రాజకీయ పరిణామాలు గమనిస్తుంటే ప్రధాన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ గత అనుభవాల నుంచి ఏ మాత్రం గుణపాఠాలు నేర్చుకోలేదని స్పష్టమౌతోంది. నలభై ఏళ్ళ సుదీర్ఘ అనుభవమున్న చంద్రబాబునాయుడు నాయకులను అరువుతెచ్చుకొనే భావదరిద్రపు అసమర్ధతతో సతమతమవుతున్న తీరు అత్యంత శోచనీయం. నెల్లూరురూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి ఇటీవల ప్రభుత్వంలో తనకు జరుగుతున్న అవమానాల గురించి చెప్తూ అందుకు ప్రతిగా తాను టిడిపి తీర్థం పుచ్చుకొంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే! రాబోయే ఎన్నికలలో తానే తెలుగుదేశం పార్టీ అభర్ధిని అని కూడా ప్రకటించేశాడు. మంచిదే, తప్పులేదు, ప్రజాస్వామ్యంలో ఆ హక్కుని ఎవరూ కాదనలేరు. ఇక్కడే ప్రధాన ప్రతిపక్షం టీడీపీ బలహీనతల్ని పరోక్షంగా శ్రీధర్‌రెడ్డి బయటపెట్టాడు. క్షేత్రస్థాయిలో టీడీపీ ఏ మాత్రం బలపడలేదని కోటంరెడ్డి తాజా వ్యాఖ్యలే నిదర్శనం. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర గడువున్న తరుణంలో, వైసీపీ ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డి రానున్న రోజుల్లో తాను నెల్లూరు రూరల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో వుంటానని ఇంతముందు ప్రకటించడంతో, టిడిపిలో అంతర్గత ప్రజాస్వామ్యం మేడిపండు చందమే అని కార్యకర్తల మనోభావాలకు విలువలేదని, రాజకీయ బూర్జువాతత్వం తప్ప విలువలు లేవని స్పష్టమైపోతుంది. అయితే ఇలాంటి పరిస్థితి ఒక్క టిడిపిలోనే కాదు, అన్ని చోట్లా ఉంది. పార్టీల పేర్లు ఊర్లు మారినా తీరు ఒక్కటే. గెలుపే పరమావధిగా భావించి కనీస విలువలు వదిలేసి రాజకీయ పార్టీలను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుగా మార్చేస్తున్న విధానం ఆందోళన కలిగిస్తోంది. చంద్రబాబునాయుడు లాంటి సీనియర్ నాయకుడు సైతం గెలుపే ధ్యేయం అన్న చందాన విలువలను గాలికి వదిలేసి, అప్పటివరకు పార్టీ జెండా భుజాన మోసిన కార్యకర్తలను వారి త్యాగాలను గడ్డిపోచ కింద తీసేయడం నేటి అనైతిక రాజకీయ వ్యవస్థకు అద్దం పడుతోంది.

తమ పార్టీ తరపున పోటీచేస్తానని ప్రకటించడానికి కోటంరెడ్డి ఎవరనే ప్రశ్న టీడీపీ నుంచి రాకపోగా, ఇదేదో గొప్ప విషయం అన్నట్టుగా మీడియా ప్రచారం చేయడం, ఆ పార్టీ బలహీనతని రుజువు చేస్తోంది. శ్రీధర్‌రెడ్డి రాకపోతే నెల్లూరురూరల్ టీడీపీకి అభ్యర్థులే లేరా? పార్టీ అంతటి దుస్థితిలో ఉందా..? నాలుగు దశాబ్దాలకు పైబడిన చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీ, తమ అభ్యర్థిని పక్క పార్టీ నుంచి తెచ్చుకోవాల్సిన దయనీయ స్థితిపై ఒక్కసారి ఆలోచించుకోవాలి. నెల్లూరు రూరల్ మాత్రమే కాదు, మరో 90 నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి వున్నట్టు సమాచారం.

వైసీపీ టికెట్ ఇవ్వకపోతే, తమ వైపు వస్తారనే ఆశతో టీడీపీ అధికారపార్టీ ప్రజాప్రతినిధుల వైపు ఎదురుచూస్తోందని అంటున్నారు.అలాంటి అసంతృప్తి ఉన్న వైసీపీ ఎంఎల్ఏల కోసం ప్రత్యేకంగా మధ్యవర్తులని వినియోగిస్తోంది అంటే టీడీపీ ఎంత బలహీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు వైసీపీ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రచారం చేస్తున్న టీడీపీ, తమ పార్టీని బలోపేతం చేసుకోకపోగా, ఇలాంటి సంఘటలను భారీగా ప్రచారం చేసుకుని ఎందుకు గర్వపడుతుందో అర్థం కావడం లేదు. తనను తానే తక్కువ చేసుకుని టీడీపీ చూపించుకుంటోందంటే... ఆ పార్టీ పతనాన్ని అర్థం చేసుకోవచ్చు. 'సమయం లేదు మిత్రమా!' అనే సినిమా డైలాగ్‌లా చంద్రబాబు లాంటి సుధీర్ఘ రాజకీయ అనుభవమున్న వారికి మారమని చెప్పడం ఎంతవరకు సబబో కానీ, వారు ఇలాంటి అప్రజస్వామ్యపు వ్యవహారశైలి వీడకపోతే మాత్రం తెలుగుదేశం పార్టీ బలోపేతం అయిందని అనుకోడం నేతిబీర కాయలో నేతి చందమే. కష్టమైనా.. నష్టమైనా.. భారమైనా.. ఘోరమైనా... సొంత కాళ్ళమీద నిలబడ్డం, అన్ని సమయాలలో వెంట నడిచిన కార్యకర్తల మనోభావాలకు విలువనివ్వడం, వారిలో ఒక నమ్మకాన్ని, భరోసాని నింపడం ద్వారా మాత్రమే బాబు తమ పార్టీని ముందుకు తీసుకెళ్ళగలరు. ఇలా వలసపక్షులను నమ్ముకొంటే మిగిలేది 2019 అనుభవమే.

- విహారి



## మూలస్థానేశ్వరాలయంలో..

# 14 నుంచి బ్రహ్మోత్సవాలు


నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 14 నుంచి మహాశివరాత్రిని పురస్కరించుకుని పెద్దఎత్తున బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 8న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ విషయమై ఆర్డీఓ మలోల అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని అధికారులకు సూచించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ వెంకటేశ్వరరెడ్డితో కలసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## తాళాలు పగలగొట్టి

# ఎన్‌బిటి కాలనీలో చోరీ

నెల్లూరు డైకస్‌రోడ్డులోని ఎన్‌బిటి కాలనీలోని ఓ ఇంటికి తాళం వేసి ఉండగా, దొంగలు తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. విశ్రాంత పోలీసు అధికారి ఉన్నిసాబేగం ఇంట్లో ఈ దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉన్నిసాబేగం ఇంటికి తాళాలు వేసి మక్కా యాత్రకు వెళ్ళారు. అది గమనించిన దొంగలు చోరీకి పాల్పడి, ఇంట్లో ఉన్న రూ.30 వేలను దోచుకుపోయారు. ఇరుగుపొరుగు వారి సమాచారంతో ఆమె సోదరుడు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేదాయ పాళెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం జగన్‌ని కలిసిన శ్రీనివాసులు (RSR)



ఆర్.ఎస్.ఆర్‌గా అందరికీ సుపరిచితుడు, ఇరుకళల అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌ని కలిశారు. తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎంని కలిసి ఇరుకళల అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున సహకరించవలసినదిగా కోరారు. శ్రీనివాసరావు అభ్యర్ధనకి సానుకూలంగా స్పందించిన జగన్ అభయహస్తమిచ్చి పంపారు. రాజశేఖరరెడ్డి జమానానుండి వైఎస్ అభిమానిగా ఆదాల ప్రభాకరరెడ్డి అనుచరుడిగా ఆర్ఎస్ ఆర్ రాజకీయాలలో కొనసాగుతున్నాడు.

## డిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌లో..

# 26న రక్తదాన శిబిరం



అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామం-పురిణి క్రాస్‌రోడ్డులో ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ (డిఎసార్ ట్రస్ట్)లో ఫిబ్రవరి 26వ తేది ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. దివంగత దేవిరెడ్డి శారద 6వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేస్తే బాధితులకు ప్రాణదానం చేసినట్లేనని, నెల్లూరు రెడ్‌క్రాస్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, రక్తదాతలు ఇతర వివరాల కోసం 9154854755, లేదా 9100551108 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

# ఊటుకూరు బ్రహ్మారెడ్డి.. కన్నుమూత



'రాష్ట్రీయ రతన్' అవార్డు గ్రహీత, విబిఆర్ గ్రూప్ విద్యా సంస్థల అధినేత, విద్యాదాత ఊటుకూరు బ్రహ్మారెడ్డి ఈనెల 8వ తేది బుధవారం కన్నుమూశారు. నగరంలోని దర్గామిట్ట సరస్వతినగర్‌లోని మహిళా పాలిటెక్నిక్ సమీపంలో ఉన్న వారి నివాసంలో ఆయన భౌతికకాయాన్ని స్థానిక ప్రముఖులు, పలు విద్యాసంస్థల వారు, మాజీ ఎమ్మెల్యే సీవి శేషారెడ్డి తదితర నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

# కాకాణికి ఓటమి భయం పట్టుకుంది

## మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి



మంత్రి కాకాణికి ఓటమి భయం పట్టుకుందని మాజీమంత్రి..టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఓడిపోతామనే భయంతోనే కాకాణి వెంకటగిరిపై కన్ను వేసినట్లుందన్నారు. వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెంలో ఇటీవల జరిగిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో పాల్గొన్న సోమిరెడ్డి, మంత్రి కాకాణికి ప్రజల్లో నిరాదరణ ఎదురవుతోందన్నారు. పలు సర్వేల్లో కూడా కాకాణికి ఓటమి తప్పదనే అంచనాలు వస్తున్నాయన్నారు. వైసీపీకి చెందిన ఐ ప్యాక్ సర్వేలోనూ ఫలితం కాకాణికి వ్యతిరేకంగా వచ్చిన మాట వాస్తవం కాదా?.. వెంకటగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాకాణి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న మాట వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. కాకాణి ఓటమిని ఎవరూ ఆపలేరన్నారు. సర్వేపల్లి చరిత్రలో వరుసగా ఎవరూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవలేదని, మంత్రి కాకాణి ఆ భయంతోనే సర్వేపల్లి నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి వెంకటగిరిపై కన్ను వేశాడని అన్నారు. రానున్నది టిడిపి ప్రభుత్వమేనని, సర్వేపల్లి ప్రజలు తమనే గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## రూ. 14.5 లక్షల

# సిఎస్ఆర్ ఫండ్ అందజేత



కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్) కింద సామాజిక బాధ్యతతో సౌత్ ఇండియా కృష్ణ ఆయిల్ అండ్ ఫాక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇటీవల ప్రభుత్వానికి తన వంతు సహకారంగా ఇటీవల 14.5 లక్షల రూపాయలు అందజేశారు. ముత్తుకూరు మండలంలోని పంటపాలెంలో ఉన్న సౌత్ ఇండియా కృష్ణ ఆయిల్ అండ్ ఫాక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ హెడ్ పివి చంద్రమౌళి నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఆ చెక్కును జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు ఇచ్చారు. సామాజిక బాధ్యతతో స్పందించిన ఆ కంపెనీ వారిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రావిప్రోలు సుబ్రహ్మణ్యం గారికి

## శత జయంతి నివాళులు



08.02.1923 30.11.1981

నెల్లూరుజిల్లా పల్లిపాడు వాస్తవ్యులు, వి.ఆర్.కళాశాల పూర్వ విద్యార్థి,
ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి 24 సంవత్సరాల అతి చిన్నవయసులో
హిస్టరీలో పిహెచ్‌డి పట్టా పొందిన విద్యావంతుడు,
నాగార్జునకొండ లోయలో త్రవ్వకాలు జరిపి శిల్పసంపదను వెలికితీసి
ప్రపంచ ఖ్యాతినార్జించిన పురావస్తు శాస్త్రవేత్త,
ఉస్మానియా & ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాల్లో చరిత్రాచార్యుడు,
ఎంతోమంది జీవితాలకు వెలుగునిచ్చిన మానవతామూర్తి,
మా నాన్న కీ॥శే॥ మర్మావుల రామయ్య గారి ఆప్తమిత్రుడు,
నిగర్వి, ఎందరికో మార్గదర్శకుడు

**ఆచార్య రావిప్రోలు సుబ్రహ్మణ్యం గారి**
M.A., Ph.D. FRAS (London)
**శత జయంతి** సందర్భంగా వారి దివ్య స్మృతికి నా నివాళులు.

**- డాక్టర్ మర్మావుల సుబ్రహ్మణ్యం**
విశ్రాంత ప్రిన్సిపాల్, వి.ఆర్.కళాశాల, నెల్లూరు.

లాయర్
ఫిబ్రవరి 10, 2023

# టర్కీ, సిరియాలను వణికిస్తున్న భూకంపం

ఘోర విపత్తు, మహా ప్రళయం, భూ విలయం వంటి మాటలు కూడా ఆ భూకంప తీవ్రతను వర్ణించడానికి చాలవు. అది భూకంపమో, ప్రకంపనమో..భూ ఆగ్రహమో.. ఏదైతేనేం.. రెండు దేశాలు ఆ విలయం దెబ్బకు రెక్కలు తెగిన పక్షుల్లా విలవిలలాడుతున్నాయి. ఆ ఘోర విపత్తును చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందుతోంది. ప్రకృతి విపత్తు ఎంత దారుణంగా ఉంటుందో, మృత్యురాకాసి కోరలు చాస్తూ వచ్చి మీదపడితే ఎంత భయంకరంగా ఉంటుందో.. భూకంపం వచ్చినా అంతే అన్నట్లుగా ఎక్కడ చూసినా మరణమృదంగమే! టర్కీ, సిరియా దేశాలు ఆ భూప్రకంపనల ధాటికి తట్టుకోలేక గజగజ వణికిపోతున్నాయి. ఫిబ్రవరి 6వ తేది..తెల్లవారితే సోమవారం..ఆ దేశాల ప్రజలకు మృత్యుపాశమైంది. వేకువన 4.27 గంటల ప్రాంతంలో ప్రజలు ఆదమరచి నిద్రిస్తున్న వేళ భూకంపం మృత్యుపంజా విసిరింది. ఏమి జరిగిందో తెలుసుకునే లోపలే.. అంతా అయిపోయింది. కళ్ళుమూసి తెరిచేలోగా.. జరగకూడని ఘోరమంతా జరిగిపోయింది. అనేక నగరాలు సైతం శిథిలాల దిబ్బగా, శవాల కుప్పగా మారిపోయాయి. తెల్లవారకముందే ఎన్నో ప్రాణాలు కొడిగట్టిపోయాయి. రిక్టర్ స్కేలు (భూకంప లేఖిని)పై ఎంతో ప్రమాదకరమైన రీతిలో భూకంప తీవ్రత 7.8గా నమోదైంది. టర్కీలోని గాజియాన్‌తెప్ నగర ప్రాంతానికి 33 కిలోమీటర్ల దూరంలో 18 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని నిపుణులు గుర్తించారు. ప్రళయాన్ని సృష్టించిన ఆ భూకంపం తర్వాత కూడా వదిలిపెట్టలేదు. వరుసగా మరో 50 శక్తివంతమైన భూప్రకంపనలతో ఆ దేశాలను మరింతగా హడలెత్తించింది. గంటల వ్యవధిలోనే సోమవారం మధ్యాహ్నం, సాయంత్రం కూడా మళ్ళీ రెండు భూకంపాలు విరుచుకుపడ్డాయి. వీటి తీవ్రత 7.6, 6.0గా గుర్తించారు. హటాత్తుగా వచ్చిన ఆ భూప్రకంపనలకు వేలాది భవనాలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. వాటిలో ఎంతమంది ఉన్నారో.. ఎంతమంది బతికి ఉన్నారో చెప్పలేని దుస్థితి. తాము భద్రంగా ఉండేందుకు కట్టుకున్న భవనాలే నెత్తిన విరిగిపడుతుంటే, ప్రాణాలు కాపాడుకోవడానికి కాలి సత్తువకొద్దీ పరుగులు తీశారు జనం. ఎక్కడ చూసినా తునాతునకలైన భవనాలు.. వాటికింద శవాల గుట్టలు, ఎంతమంది మరణించారో లెక్కకే అందడం లేదు. ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనా ప్రకారం కనీసం 20వేల మందికి పైగానే ప్రజలు ఈ భూకంప భూతం చేతిలో ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంచనా. అయినా ఇంకా వెతికేకొద్దీ మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రపంచంలో ఎక్కువగా ఇండొనేషియా, టర్కీ దేశాల్లో తరచూ భూకంపాలు వస్తుంటాయని ప్రతీతి. భూమి అంతర్భాగంలో ఉండే పలకలు కదలడం వల్లే ఏర్పడే శక్తితో భూకంపాలు వస్తుంటాయని శాస్త్రవేత్తలు చెప్తుంటారు. శతాబ్దాల తరబడిగా టర్కీ భూకంప ప్రాంతంగా ఉంది. ఇప్పటికే పలుసార్లు ఆ దేశం భూకంపాలను చవిచూసింది. కోట్లాదిమంది వాటికి బలైపోయారు కూడా. అయినా, ఇప్పుడు వచ్చిన భూకంపం గతంలో వచ్చినవాటికంటే పెద్దదని అంటున్నారు. బహుశా ఈ శతాబ్దంలోనే ఈ భూకంపం అతిపెద్ద ప్రమాదకారిగా నమోదు కావచ్చని కూడా నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ భయంకర భూకంపం టర్కీ, సిరియా దేశాల ప్రజలకు నరకం చూపిస్తోంది. ఏ క్షణంలో ఏమవుతుందోనని వణికిపోతున్నారు. ఎక్కడ చూసినా ధారలు ధారలుగా కన్నీరే!..టర్కీ-సిరియా దేశాల కళ్ళల్లో ఆ రక్తకన్నీరును చూసి ప్రపంచమే తల్లడిల్లిపోతోంది. సిరియా దుస్థితి మరింత దయనీయం. యుద్ధంతో, కరోనా రాకాసితో, కలరా వంటి వ్యాధులతో అల్లాడుతున్న సిరియాకు ఈ భూకంపం మరో విపత్తుగా మారింది. అసహాయులైన ప్రజలంతా శోకసముద్రంలో మునిగి భోరుమని విలపిస్తున్న వేళ, ఈ భయంకర విపత్కర సమయంలో.. టర్కీ-సిరియా దేశాలను ఆదుకునేందుకు ప్రపంచమే కదిలివస్తోంది. ఇప్పటికే 45 దేశాలు ఆ దేశాల కన్నీరు తుడవడానికి, చేతనైనంత సాయం చేసి ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ముందుకు వస్తున్నాయి. ఇక మనదేశం సంగతి చెప్పనే అక్కర్లేదు. ప్రపంచంలో ఏ దేశానికి కష్టం వచ్చినా 'నేనున్నా'నంటూ ముందుకు వచ్చి ఆదుకునే మానవీయదేశం భారత్. అందుకే ప్రధాని మోడీ సారధ్యంలో ఆగమేఘాల మీద సహాయక చర్యలు చేపట్టడానికి భారత బృందాలు ఆ దేశాలకు భారీఎత్తున తరలివెళ్తున్నాయి. అన్నిదేశాల వారు ఈ ఆపదవేళ..మానవీయ హృదయంతో భూకంప బాధితులను వెంటనే ఆదుకోవాలి. ఇదే ఇప్పుడు ప్రపంచం ముందున్న తక్షణ కర్తవ్యం!

# తాళం వేశామో!..ఇల్లు గుల్లే!



ఇల్లు భద్రంగా ఉండాలంటే తాళం వేసి వెళ్ళాలన్న సంగతి అందరికీ తెలిసిందే. ఎక్కడికన్నా బయటకు వెళ్ళేటప్పుడు తాళాలు సరిగా వేశామో లేదో పదేపదే చూసుకుంటుంటాం కూడా. దొంగల బారిన పడకుండా ఉండాలంటే ఇళ్ళకు తాళం వేయడం అన్నది ఎవరూ మరచిపోలేనిది. అయితే, ఇప్పుడా రోజులు పోయాయి. ఇళ్లకు తాళం వేసి వెళ్తే చాలు..మనం తిరిగొచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేసేస్తున్న మాయదారి కాలమిది. ఎప్పుడెప్పుడు ఇళ్ళకు తాళం వేసి వెళ్తారా.. దోచుకుపోదామా.. అన్నట్లు కాచుకుని ఉంటున్నట్లుంది దొంగలు. నెల్లూరుజిల్లాలో ఇటీవలి కాలంలో ఈ తరహా కొత్తరకం దొంగతనాలు మితిమీరిపోతున్నాయి. తాళం వేసిన ఇళ్ళను కనిపెట్టి, ఇక ఆ ఇళ్ళ యజమానులు ఇప్పుడిప్పుడే రారు అని నిర్ధారించుకుని రాత్రికి రాత్రి ఇళ్ళు దోచుకుపోతున్నారు. దీంతో ఇళ్ళ యజమానులు లబోదిబోమంటున్నారు. ఇళ్ళకు తాళం వేసి వెళ్ళేటప్పుడు చుట్టుపక్కల ఉన్నవారిని అప్రమత్తం చేసి వెళ్ళడమో, లేదా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వడమో మనవాళ్లకు అలవాటు లేదు కదా!.. దీంతో దొంగల పని మరింత సులువైపోతోంది. ఏ అర్ధరాత్రో అపరాత్రో, లేదా పట్టపగలే వచ్చి ఎంచగ్గా ఇళ్ళ తాళాలు పగలగొట్టి, లోపలున్న బీరువాలు వగైరాలను కూడా పగలగొట్టి, ఉన్న సొత్తంతా మూటగట్టుకుపోతున్నారు. ఒకటి కాదు, రెండు కాదు, ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ జరిగిపోతూనే ఉన్నాయి. నిత్యం వార్తాపత్రికల్లో ఇలాంటి చోరీలు షరామామూలైపోతున్నాయి. పల్లెలు, పట్టణాలు, నగరమని లేదు..ఎక్కడ పడితే అక్కడ ఈ తరహా కొత్త దొంగతనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. దొంగతనం జరిగాక పోలీసులు వచ్చి, క్లూస్‌టీమ్ నిపుణులతో పరిశీలనలు జరిపి పోలీసు బృందాలతో దొంగల పనిపట్టడానికి రంగంలోకి దిగుతున్నారు. అలుపెరుగకుండా గాలిస్తూనే ఉన్నారు కానీ, దొంగల ఆచూకీ మాత్రం తెలియడం లేదు. తాళాలు పగలగొట్టడంలో నిపుణులైన దొంగలు ఇలాంటి చోరీలను అవలీలగా చేసుకుపోతున్నట్లు జనం అనుకుంటున్నారు. తాళం వేసిన ఇళ్లనే ఎంచు

## సమస్యల తో 'రణం'

కుంటున్నారు. ఒకరోజు ఏ బుచ్చిలోనో దొంగతనం జరిగితే, మరుసటి రోజు జిల్లాలో మరో మారుమూలన ఉన్న ఊళ్లో ఇళ్ల తాళాలు పగలగొట్టి సొత్తు దోచుకుపోతున్నారు. పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతున్నాయి ఈ దొంగతనాలు. సుమారు అయిదారు నెలలుగా ఇలాంటి చోరీలు జిల్లావ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి. ఎక్కడా దొంగలు పట్టుపడడం లేదు.ఎవరింట్లో దొంగలు పడిందీ, ఆ తర్వాత యజమానులు వచ్చి చూసేదాకా తెలియడం లేదు. ఇరుగు పొరుగు వారు ఎంతసేపని ఇతరుల ఇళ్ళకు కానీ, గుళ్ళకు కానీ కాపలా కాయగలరు?..ఎవరి పనులు వారివి. రాత్రిపూట ఏ ఇంట్లోనైనా తాళాలు పగులగొడుతున్న శబ్దం వినిపించినా లేచేదెవరు?..ఏం జరుగుతోందని ఆరా తీసేదెవరు?.. రాత్రివేళల్లో తలుపులు తీసి బయటకు వెళ్ళాలంటే దొంగలభయం కదా! పోలీసులు పాపం రేయింబవళ్ళు గస్తీ కాస్తూనే ఉన్నారు. కానీ, దొంగలు మాత్రం దొరకడం లేదే!.. ఇళ్ళలోనే కాదు, గుళ్ళలో కూడా ఇదే తంతు. తాళాలు పగలగొట్టడం, ఉన్నదంతా ఊడ్చుకుపోవడం. అమ్మవారి ఆలయాల్లో కూడా భయమన్నదే లేకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు. హుండీలు పగలగొట్టి భక్తులు వేసిన కానుకలు పట్టుకుపోతున్నారు. ఇటీవలి కాలంలో పలు ఆలయాల్లో, ముఖ్యంగా ఊరి శివార్లలో ఉన్న గ్రామదేవతల ఆలయాల్లో చోరీలు జోరందుకున్నాయి. పూజారి తలుపులకు తాళం వేసి మళ్ళీ తెల్లారి వచ్చేసరికి దొంగతనం జరిగిపోతోంది. వీటికి అంతేలేదా?..అని జిల్లా ప్రజలు గోడుగోడుమంటున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ దొంగతనాల మీద మరింతగా దృష్టిపెట్టాలి. గస్తీ బాగా పెంచాలి. నిఘా బృందాలను అప్రమత్తం చేసి, ఇళ్ల తాళాలు పగలగొట్టి నిర్భయంగా చోరీలు చేస్తున్న దొంగలమూకలను కనిపెట్టి, వారి ఆట కట్టించాలి. ఇళ్ళనుంచి బయటకు వెళ్ళేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కలిగించాలి. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారాన్ని గమనించి ఎప్పటికప్పుడు పోలీసులకు తెలపాలని ప్రజలను అప్రమత్తం చేస్తుండాలి. తాళాలు పగలగొట్టి ఇళ్ళు గుళ్ళు దోచుకుంటూ, సులభ సంపాదనకు దొంగలు బాగా అలవాటు పడినట్లుంది. వారినెలాగైనా పట్టుకుని దొంగతనాలను అరికట్టాలి. అంతేకాదు, మరికొందరు అగంతకులు రోడ్లమీద ఒంటరిగా వెళ్ళే మహిళలను గమనించి, వారి వెనకాలే మోటారు బైకుల మీద స్పీడుగా వెళ్ళి, వారి మెడల్లో ఉన్న బంగారుదండలు పెరుక్కుని పోవడం కూడా తరచూ జరుగుతూనే ఉంది. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి గొలుసుదొంగలు కూడా ఇటీవల బాగా పెట్రేగిపోతున్నారు. ఎంతో కష్టపడి సంపాదించుకుని, పైసాపైసా కూడబెట్టుకుని ఓ తాళిబొట్టు సరుదు చేయించుకుంటే, అది కాస్తా దొంగలపాలైపోతే బాధితులకు ఎంత బాధగా ఉంటుందో చెప్పలేం! ముఖ్యంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాల నిఘా ఇంకా విస్తృతం చేయడమే కాక, వాటిని డేగకళ్ళతో అనుక్షణం పరిశీలిస్తుండడం కూడా ఎంతో అవసరం. అన్ని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో నిఘా పెట్టి, రాత్రివేళల్లో బస్సుల్లోంచి, రైళ్ళలోంచి ఎవరెవరు దిగుతున్నారో, ఎటు వెళ్తున్నారో, నిఘా కెమెరాల ద్వారా కనిపెట్టి ఉండాలి. ఇళ్ళకు తాళం వేసి వెళ్ళినా, దొంగల చేతిలో పడి ఇల్లు గుల్లవుతుండడం ఎంత ఘోరం?..ఈ దుస్థితి తొలగిపోవాలి. ప్రజల భద్రతకు, వారి ఆస్తుల రక్షణకు ఇంకా ఎలాంటి చర్యలు తీసుకుంటే బావుంటుందో పోలీసు ఉన్నతాధికారులు, నిపుణులు ఆలోచించాలి. ఏదేమైనాసరే, ఇళ్ళ దొంగతనాలు పూర్తిగా సమసిపోయేలా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

**- సంచారి**

# తెలుగు సినిమాకి వరం.. కాశీనాధుని విశ్వనాథ్

సుప్రసిద్ధ సినీదర్శకులు 'కళాతపస్వి' కే.విశ్వనాథ్ గారు దైవసాన్నిధ్యం పొందారని తెలిసిన మరుక్షణం ఓ విధమైన ఆందోళన కలిగింది. సంప్రదాయబద్ధమైన తెలుగు సినిమా దివికేగిపోయిందా అనిపించింది. ఆయన వయోభారంతో అనారోగ్యం పాలైనప్పుడే సంప్రదాయ తెలుగు సినిమా సగం చచ్చింది. బాహుబలులు, ఎర్రచందనం స్మగ్లర్లు , కోలార్ బంగారు ఘనులు, వెకిలి వీరయ్యలు వంటి చిత్రాల ప్రాధాన్యత పెరిగింది. శంకరాభరణం, స్వాతిముత్యం, సాగరసంగమం, సిరివెన్నెల, స్వర్ణకమలం, సూత్రదారులు, శృతిలయలు వంటి ఆణిముత్యాలు ఇప్పుడు తెలుగుతెరపై కరువైపోయాయి. బహుశా విశ్వనాథ్‌గారు మళ్ళీ పుట్టేంతవరకు ఇక అలాంటి సినిమాలు చూసే యోగం లేదేమో? విశ్వనాథ్ గారి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

– *లక్ష్మీభరద్వాజ్*, **హైదరాబాద్.**




## రాజకీయాలలో హత్యలుండవు..
# ఆత్మహత్యలే!

'రాజకీయాలలో హత్యలు ఉండవు... ఆత్మహత్యలే' అనడానికి నెల్లూరుజిల్లాలో తాజాగా జరుగుతున్న రాజకీయ పరిణామాలే పెద్ద ఉదాహరణ. వెంకటగిరిలో ఆనం, ఉదయగిరిలో మేకపాటి, నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డిలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ముఖ్యంగా కోటంరెడ్డి ఉన్నట్లుండి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి అభాసుపాలయ్యాడు. ఫోన్ ట్యాపింగ్ అని చేసిన ఆరోపణ కూడా లంకా రామశివారెడ్డి ప్రకటనతో నిందగా తేలిపోయింది. ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలనుకున్న శ్రీధర్‌రెడ్డి.. ఇప్పుడు ఆయనే ఇరకాటంలో పడిపోయాడు.

*వి.రఘురామిరెడ్డి*, **హైదరాబాదు.**

# ఓట్ల కోసం.. జిమ్మిక్స్

జనరల్ ఎలక్షన్స్ ఇంకా సంవత్సరం ఉండగా ముందు నుండి జిమ్మిక్స్ ఆరంభించారు. వాటిలో మహిళల కోసం ఆకర్షణీయ పథకాలు... 1. ఉద్యోగం చేసే మహిళలకు సంవత్సరము పాటు పూర్తి జీతంతో మాతృత్వ సెలవులు. ఇది భారతదేశములో ఏ ఇతర రాష్ట్రములో గానీ, వేరే దేశాలలో కానీ లేదు. ఇది చాలా హర్షణీయం. కాని దీనితోపాటు పురుషులకు కూడా 5నెలల పాటు పితృత్వ సెలవులిస్తే బాగుంటది. వారు సెలవులో ఉన్నప్పుడు ఆగిపోయిన పని కొనసాగించుటకు ఔట్‌సోర్సింగ్ విధానములో నిరుద్యోగులను నియమించుకోవాలి. అప్పుడు ఒక ఉద్యోగమునకు రెండు జీతాలు ఇవ్వాల్సి వస్తుంది. ప్రభుత్వం సిద్ధపడాలి. 2. ఇంకా మంచి మంచి పథకా లున్నవి. మహిళలకు 'జగన్ వంటింటి కానుక' పేరుతో రూ.600/–కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలి. మిగతాది వారే ఖర్చుచేస్తారు. గ్యాస్ కనెక్షన్ అసలే లేనివారికి ఉచితకనెక్షన్ ఇవ్వాలి. 3. మహిళలు వాడే స్కూటీలకు, స్కూటర్లకు పెట్రోల్ లీటర్ 70 రూపాయలకు ఇవ్వాలి. కులమత రేషన్ కార్డు ప్రసక్తి లేకుండా.. కేవలం ఆధార్‌కార్డ్ నెంబర్‌తో ఇవ్వాలి. 4. మహిళలకు ఆర్‌టిసి సిటీ బస్సులలో, ఊళ్ళకుపోయే బస్సులకు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు కూడా ఛార్జీలలో 25% తగ్గించాలి. ఇవన్నీ చేయగలిగితే ఓట్లు మూకుమ్మడిగా ప్రభుత్వానికి పడతాయి. 175కి 175 సీట్లు వచ్చేస్తాయి. ఈ టాపిక్ మీద భోగాది గారు ఇంకా చాలాబాగా వ్రాశారు. వారి సలహాలు పాటించాలి.

– *భవానీ శంకర్*, **నెల్లూరు.**

## జెఇఇ మెయిన్ ఫలితాల్లో
# 'విశ్వసాయి' ప్రభంజనం



ఇటీవల ప్రకటించిన జెఇఇ మెయిన్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలకు చెందిన 96 మందికి పైగా విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించి అందరి అభినందనలు అందుకున్నారు. వీరిలో కె.అఖిల్ అనే విద్యార్థి జాతీయస్థాయిలో 98.99 పర్సంటైల్ సాధించడం విశేషం. మరో 11మంది విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్‌తోను, 31 మంది విద్యార్థులు 80 పర్సంటైల్ కంటే ఎక్కువగా సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. విద్యార్థుల నిరంతర కృషి, పట్టుదల, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్‌లు ఈ సందర్భంగా చెప్పారు. ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులందరినీ వారు అభినందించారు.

# విద్యా విధానాలు బాగలేవంటూ నిరసన

## - విద్యాపరిరక్షణ కమిటీ ఆందోళన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావిధానాలేమీ బాగాలేవని, అస్తవ్యస్తంగా ఉన్న ఆ విధానాల వల్ల పేద విద్యార్థులకు విద్యకు దూరమవుతున్నారని ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.పిచ్చిబాబు ధ్వజమెత్తారు. ఈనెల 7న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద ఆ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర జాతీయ విద్యావిధానాన్ని నిలిపేయాలని కోరారు. ఆ మేరకు గతంలో ఇచ్చిన 117, 85, 85 నంబర్లు గల జీఓలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ.సురేంద్రరెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు సునీల్, డిటిఎఫ్ నాయకుడు రమణయ్య, రియాజ్, జుల్ఫీకర్, వి.కోటేశ్వరరావు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# జొన్నవాడ కామాక్షమ్మకు.. శేషవాహనం బహుకరణ



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షి తాయి అమ్మవారికి నెల్లూరుకు చెందిన దాతలు దివంగత మునగా హనుమంతరావు జ్ఞాపకార్థం ఆయన భార్య వరలక్ష్మి, కుటుంబ సభ్యులు అనిల్‌కుమార్, అలేఖ్య, ప్రవీణ్‌కుమార్, హర్షితలు ఇటీవల 6 లక్షల 50వేల రూపాయల వ్యయంతో పంచలోహాలతో తయారుచేసిన శేషవాహనాన్ని బహుకరించారు. తొలుత ఈ వాహనానికి ఆలయ అర్చకులు సంప్రోక్షణ నిర్వహించి, దాతలకు దైవదర్శనం చేయించి ఆశీర్వదించారు. ఆలయ ఛైర్మెన్ సుబ్రహ్మణ్యంనాయుడు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# నేతన్నలను ఆదుకోవాలి

## బిజెపి నేత మిడతల వినతి



జిల్లాలో చేనేతకారులు అనేక సమస్యల్లో ఉన్నారని, వారిని ఆదుకోవాలని బిజెపి నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఇటీవల జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో పది వేలకుపైగా కుటుంబాలు చేనేత వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నారని, అందులో 3800 మందికి మాత్రమే నేతన్న నేస్తం క్రింద 24 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని, కేవలం మగ్గం ఉన్నవారికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపుకార్డులు మంజూరు చేసిందని, నేతపనిలో పన్నెలు కట్టేవారు, ఆసులు పోసేవారు, పడుగులు చేసేవారు, అచ్చులు అతికేవారు, రంగులు వేసేవారు, అల్లులు పట్టేవారు, కండెలు చుట్టేవారు, డిజైన్ చేసేవారు, రాట్నం వడికేవారు కూడా కలసి ఉంటారని, వారంతా కలిసి శ్రమిస్తేనే మగ్గం గంట మీదకి నేసేందుకు వస్త్రం వస్తుందని, అందువల్ల నేతపనిలోని ఉపవృత్తులన్నింటిని కూడా గుర్తించి ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సి ఉందన్నారు. చేనేతరంగం నానాటికీ సంక్షోభంలో కూరుకుపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిహెచ్ సుబ్రహ్మణ్యం, రఘురామయ్య, జయచంద్ర, మువ్వల రాంబాబు, రత్నంనాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, బెల్లంకొండ రామకృష్ణ పాల్గొన్నారు.



# పల్లెకు కదిలొచ్చిన.. కార్పొరేట్ వైద్యం

## మురుగళ్ళ ప్రజలకు ఆధునిక వైద్యసేవలు

## ప్రముఖ వైద్యులచే ఉచిత మెగా వైద్యశిబిరం

## జన్మభూమి సేవలో తరించిన.. డాక్టర్ రజనీకాంత్ దంపతులు



'మురుగళ్ళ'..ఆత్మకూరు మండలంలోని ఓ చిన్న పల్లెటూరు అది. అయినా, ఆ పల్లెతల్లే దేశంలో ఖ్యాతిగడించిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ పి.రజనీకాంత్‌కు జన్మనిచ్చింది. చెన్నైలోని గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్‌లో సేవలందిస్తున్న డాక్టర్ రజనీకాంత్ కాలేయ వ్యాధుల నివారణలో, కాలేయ మార్పిడిలో దేశంలోనే గొప్ప వైద్యప్రముఖునిగా కీర్తి గడించారు. తన సతీమణి, చిన్నపిల్లల వైద్యవిభాగంలో అగ్రగామిగా ఉంటున్న డాక్టర్ పి.నీరజతో కలిసి ఆయన తన పుట్టిన ఊరైన మురుగళ్ళ గ్రామ ప్రజలకు తనవంతు వైద్య సేవలందించాలనే మహదాశయంతో మురుగళ్ళకు వచ్చి ఫిబ్రవరి 5న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం, దాదాపు వెయ్యిమందికి పైగా పల్లెప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించడం విశేషం.





తనతోపాటు వైద్యరంగంలోని అనేక విభాగాల్లో నిపుణులైన సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లను కూడా తీసుకువచ్చి, తమ ఊరి ప్రజల ఆరోగ్యం కోసం పెద్దఎత్తున వైద్య శిబిరం ఏర్పాటుచేయడమే కాక, శిబిరానికి వచ్చినవారందరికీ భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. చెన్నైలోని గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రి సారథ్యంలో, ఆత్మకూరులోని శ్రీ వేంకటేశ్వర ప్రజావైద్యశాల వైద్యులైన డాక్టర్ ఎం.వెంకటేశం ఆధ్వర్యంలో రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం తదితరుల సహకారంతో నిర్వహించిన ఈ మెగా ఉచిత వైద్యశిబిరానికి ఆ గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మురుగళ్ళ ప్రాంతంలోని అనేక గ్రామాల ప్రజలు వైద్య పరీక్షల కోసం తరలిరావడంతో శిబిరంలో సందడి నెల కొంది. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ వంటి మహానగరాల్లో లభించే అత్యంతాధునికమైన కార్పొరేట్ వైద్యాన్ని పల్లెప్రజలకు అందించి వారి అభినందనలు, ఆశీస్సులు అందుకున్నారు.

### 20 మంది సూపర్ స్పెషాలిటీ వైద్యుల రాక

'ఆరోగ్యమే మహాభాగ్యం..అదే మన కుటుంబ సౌభాగ్యం' అనే నినాదంతో చేపట్టిన ఈ వైద్యశిబిరంలో దాదాపు 20 మంది ఆయా విభాగాల్లో ప్రసిద్ధులైన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఆయా విభాగాల్లో నిపుణులైన డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు (జనరల్), డాక్టర్ జె.ప్రణీత్ (ఆర్థో), డాక్టర్ ఎం.హారిక, (గైనకాలజీ), డాక్టర్ కె.ప్రవీణ్ (కిడ్నీవ్యాధుల నిపుణులు), డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్ (కార్డియాలజీ), డాక్టర్ బి.వేణు (న్యూరాలజీ), డాక్టర్ వి.శ్రీనివాసన్ (ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు), డాక్టర్ డి.మధుసూదన్(గ్యాస్ట్రో-జనరల్), డాక్టర్ డి.రేణుక (చర్మవ్యాధులు), డాక్టర్ కె.ఎన్ ప్రతాప్ (ఇఎన్‌టి), డాక్టర్ పి.రజనీకాంత్ (లివర్-గ్యాస్ట్రో), డాక్టర్ ఫణికిరణ్ (వెన్నెముక వ్యాధుల నిపుణులు), డాక్టర్ ఆఫ్రిన్ (డయాబెటిస్), డాక్టర్ ప్రవలిక(ఎం.డి), చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు డాక్టర్ పి.నీరజ, డాక్టర్ బి.రాంప్రసాద్, డాక్టర్ పి.కిరణ్, దంత వ్యాధుల నిపుణులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ కె.ప్రతిభ, డాక్టర్ పి.కల్యాణి తదితరులు ఈ శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి తగు సలహాలు, సూచనలు, ఉచితంగా మందులు అందజేశారు.

### వ్యాధుల పట్ల అవగాహన

ఈ వైద్యశిబిరానికి తరలివచ్చిన పల్లె ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందజేయడమే కాక, వివిధ రకాల వ్యాధుల పట్ల వారికి నిపుణులైన వైద్యులు అవగాహన కలిగించారు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బుల ప్రాథమిక లక్షణాలను, వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వారికి తెలియజేశారు. చిన్నపిల్లల ఆరోగ్యానికి, వృద్ధులు ఆరోగ్యంగా ఉండడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వారికి అర్థమయ్యేలా వివరించారు. దీంతో ఆ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి అమూల్యమైన సమయాన్ని తమ ఆరోగ్యం కోసం వెచ్చించినందుకు డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ వెంకటేశ్వర్లుతో పాటు చెన్నై నుంచి వచ్చిన వైద్యులందరికీ గ్రామస్తులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## నాయీబ్రాహ్మణులకు
# అరుదైన గౌరవం

### యూనియన్ నాయకుల హర్షం

రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు దేవాలయాల ధర్మకర్తలుగా అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమని, ఇది నాయీబ్రాహ్మణులకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని జిల్లా నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేలూరు రంగారావు, వినుకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, దేవాదాయశాఖ మంత్రి సత్యనారాయణలు ఆలయ పాలకవర్గాల్లో తమకు స్థానం కల్పించినందుకు తమ కృతజ్ఞతలు చెప్తూ, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్ సిద్ధవటం యానాదయ్యను కొనియాడుతూ ధన్యవాదాలు తెలిపారు.




# నెల్లూరు కబుర్లు



## సిఎం జగన్.. 20న కావలికి వస్తారు

ఫిబ్రవరి 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి పర్యటనకు వస్తారని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు వెల్లడించారు. ఈనెల 6న కలెక్టరేట్‌లో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ సిఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు.



## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని రెడ్‌క్రాస్ ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో క్యాన్సర్‌పై విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్రాంత డిఎంఅండ్‌హెచ్ఓ జయసింహ పాల్గొని క్యాన్సర్ వ్యాధి లక్షణాలను, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు పేదలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించి, చికిత్సలను అందజేస్తున్నామన్నారు. ముందుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే దానిని తేలికగానే నివారించవచ్చని సూచించారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథరావు, కార్యదర్శి మస్తానయ్య, ఏఓ చంద్రశేఖర్, డాక్టర్లు నవీన్, అక్తర్, ఇన్‌చార్జి ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధిపై యువత దృష్టిపెట్టాలి

యువత స్వయం ఉపాధిపై దృష్టిపెట్టాలని, పారిశ్రామికరంగంపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సురేష్‌కుమార్ చెప్పారు. ఈనెల 7న నగరంలో నెహ్రూ యువకేంద్రం వారు యువతకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వయం ఉపాధికి ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందన్నారు.




# మంచి వ్యక్తిత్వంతోనే సమున్నత స్థాయి

### 'విశ్వసాయి' ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆర్ఓ వరప్రసాద్

విద్యార్థులు మంచి వ్యక్తిత్వంతో సమున్నతస్థాయిని చేరుకోవాలని, గురువులు, తల్లితండ్రులు చెప్పే మార్గదర్శకాలను క్రమశిక్షణతో అనుసరించి సమాజంలో గొప్ప పేరు తెచ్చుకోవాలని విద్యాశాఖ ప్రాంతీయ పర్యవేక్షక అధికారి టి.వరప్రసాద్ చెప్పారు. ఈనెల 5న నెల్లూరులోని 'విశ్వసాయి' విద్యాసంస్థల ఆధ్వర్యంలో నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో విశ్వసాయి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఎంతో కోలాహలంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విశ్వసాయి వంటి మంచి కళాశాలను ఎంచుకుని చదువుకున్న విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి వంటి ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో, అత్యుత్తమ వైద్యకళాశాలల్లో ప్రవేశాలు సాధించడం గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉన్న వారి తల్లితండ్రుల కష్టాన్ని, గురువుల బోధనలను జ్ఞాపకం పెట్టుకుని, వారిని గౌరవిస్తుండాలని, విద్యా రంగంలో ఎన్నో విజయాలు సాధిస్తున్న విశ్వసాయి విద్యాసంస్థల డైరెక్టర్లే స్ఫూర్తిగా ప్రతిఒక్క విద్యార్థి ఎదగాలని సూచించారు. ఉన్నత విలువలతో, నైతిక ప్రవర్తనతో విద్యార్థులంతా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ, వృత్తివిద్యా కోర్సుల్లోనూ ప్రావీణ్యం



సంపాదించుకోవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కె.మధుబాబు కోరారు. కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌రావులు మాట్లాడుతూ, విద్యార్థులు తల్లితండ్రుల నమ్మకం వల్లనే విశ్వసాయి ప్రతిష్ట పెరుగుతోందన్నారు. చదువుంటే ఎన్ని విజయాలనైనా సాధించవచ్చని, విద్యలో విజయానికి ఏకాగ్రత ముఖ్యమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వినయవిధేయతలు కూడా కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు పొంది వివిధ కళాశాలల్లో ప్రవేశాలు పొందిన మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వసాయి ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా.వివేకానందరెడ్డి, విశ్వసాయి విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ రోగులకు.. 'వాకర్స్' పండ్లు

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఈనెల 4న నెల్లూరులోని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవీంద్ర ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు, పలహారాలు పంపిణీ చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ గవర్నర్ ఎంవి రెడ్డి, వాకర్స్ ప్రతినిధులు ఎంవి సుబ్బారెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, సభ్యులు శ్రీమన్నారాయణ, జయప్రకాష్, జయరామిరెడ్డి, మురళీమోహన్, నరసింహారావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## మనోహర్‌రెడ్డి సేవలు మరచిపోలేం

**- పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి**




విద్యారంగానికి ఎంతో సేవ చేసిన మైథిలి మనోహర్‌రెడ్డిని మరచిపోలేమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు టౌన్ హాల్లో ఇటీవల 'అపస్మా' ఆధ్వర్యంలో జరిగిన 'మైథిలి మనోహర్‌రెడ్డి టాలెంట్ టెస్ట్ అవార్డుల' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మనోహర్‌రెడ్డి సేవలను కొనియాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన విజయానికి ఉపాధ్యాయులు సహకరించాలని, ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే ప్రైవేట్ విద్యారంగం అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. 'అపస్మా' ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆరణి కందప్ప మేస్త్రీ సేవలు..అమోఘం!




నెల్లూరులో దాదాపు వందేళ్లకు ముందే పేదల వసతి కోసం సత్రం కట్టించిన దాత ఆరణి కందప్ప మేస్త్రీ సేవలు అమోఘమని దేవాదాయ శాఖ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి కీర్తించారు. కందప్ప మేస్త్రీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 4న నగరంలోని సంతపేట ప్రాంతంలో ఉన్న ఆరణి కందప్ప మేస్త్రీ సత్రంలో జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాటి కాలంలోనే అపూర్వమైన రీతిలో కందప్ప మేస్త్రీ పేదలకు వసతితో పాటు, అన్నదానం కూడా నిర్వహించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. తొలుత ఆ సత్రంలో ఉన్న కందప్ప మేస్త్రీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్రం ఇఓ రాధాకృష్ణ, విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రరెడ్డి, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్లు చైతన్య, ఎంఎ రమణ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ల బదిలీలు

జిల్లాలో ఇద్దరు తహశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 7న ఉత్తర్వులిచ్చారు. మరో ముగ్గురు డెప్యూటీ తహశీల్దార్లకు అడ్‌హాక్ తహశీల్దార్లుగా ప్రమోషన్లిచ్చారు. కలువాయి మండల తహశీల్దారుగా ఉన్న సోమ్లానాయక్‌ను బుచ్చిరెడ్డిపాలెంకు, రాపూరు తహశీల్దారు ఎం.శ్యామ్‌సుందరరాజును సీతారామపురానికి బదిలీచేశారు. వెంకటాచలంలో డెప్యూటీ తహశీల్దారుగా ఉన్న సుభాషిణికి ఉద్యోగోన్నతి కల్పించి రాపూరు తహశీల్దారుగా నియమించారు. సైదాపురం డెప్యూటీ తహశీల్దారుగ లక్ష్మీప్రసన్నను సైదాపురం తహశీల్దారుగా నియమించారు.

# 'తంగిరాల మహాభారతం' 42వ భాగం




భీముడు అలా చెట్టుకింద పడుకున్న తల్లిని, సోదరులని చూసి ఎంత దుస్థితి కలిగిందని బాధపడతాడు. ఆ అరణ్యంలో రాక్షసులకు అధిపతి హిడింబాసురుడు. అతను ఎవరో నరులువచ్చారని గ్రహించి, తన చెల్లెలు హిడింబిని పోయి వారిని పట్టుకు రమ్మని, ఆ నరమాంసంతో విందు చెయ్యమని పంపిస్తాడు. హిడింబి పాండవులున్న చోటికి వచ్చి దూరం నుంచి ఆజానుబాహుడు, మనోహరుడు, దృఢ శరీరమున్న భీముణ్ణి చూసి మన్మథ పారవశ్యంలో పడిపోతుంది. అతనే తన పతి అని స్థిరపడి, దేవకన్యలా మారి, అతని దగ్గరకు వచ్చి, మీరెవరు, ఎక్కడినుంచి వచ్చారు అని... తనని, తన సోదరుడు హిడింబాసురుడు మిమ్మల్ని సంహరించి తెమ్మన్నాడని నిజం చెప్పి, అతనంటే తనకు ఎంతో ఇష్టమని, సోదరుని బారిన పడకుండా అందరినీ రక్షిస్తానని చెపుతుంది. భీముడు ఒప్పుకోక వెళ్లి మీ అన్నను పంపమంటాడు.

ఇంతలో హిడింబాసురుడు అక్కడికి వచ్చి హిడింబిని తిట్టి, భీమునితో తలపడతాడు. వారిద్దరి మధ్య ఘోర యుద్ధం జరుగుతుంది. ఇంతలో పాండవులు లేచి, ఆమెను చూసి ఆశ్చర్యపడతారు. హిడింబి వారికి జరిగినదంతా చెపుతుంది. భీముడు హిడింబాసురుని కాళ్ళు పట్టుకుని గిరగిరా తిప్పి చంపేస్తాడు.

అక్కడేదో దూరంగా నర సంచారం ఉందని తెలుసుకుని, అక్కడికి ప్రయాణమవుతారు. అప్పుడు హిడింబి కూడా వారి వెంట అనుసరిస్తుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## ఎట్టకేలకు ఫలించిన..
# ఆచార్య సిఎంకె రెడ్డి పోరాటం

- తమిళనాడులో తెలుగు విద్యార్థులకు ఊరట
- ఈ ఏడాది కూడా తెలుగులోనే పరీక్షలు
- సుప్రీంకోర్టు నిర్ణయంతో ఆనందం



తమిళనాడు తెలుగు విద్యార్థులకు సుప్రీం కోర్టు ద్వారా ఊరట లభించింది. మాతృభాష పరిరక్షణ కోసం ఆచార్య సిఎంకె రెడ్డి ఎంతో కాలంగా చేస్తున్న అనితరసాధ్యమైన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తమిళనాడులోని తెలుగు విద్యార్థులు తమ మాతృభాషలోనే పరీక్షలు రాసుకునేందుకు ఇచ్చిన అనుమతిని తాజాగా సుప్రీంకోర్టు మరో ఏడాదిపాటు పొడిగించడంతో విద్యార్థుల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. సర్వత్రా తెలుగుభాషాభిమానులు కూడా సుప్రీం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ సమస్యకు శాశ్వత ప్రాతిపదికపై పరిష్కారం కనుగొనాలన్నదే తమ లక్ష్యమని ఈ సందర్భంగా అఖిలభారత తెలుగు సమాఖ్య (ఏఐటిఎఫ్) వ్యవస్థాపకులు ఆచార్య సిఎంకె రెడ్డి చెప్పారు.

2006లో తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన 'నిర్బంధ తమిళం' జిఓ కారణంగా అక్కడున్న మైనారిటీ భాషల విద్యార్థులు తమ మాతృభాషల్లో చదువుకునేందుకు, పరీక్షలు రాసేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో అఖిలభారత తెలుగు సమాఖ్య తరఫున ఆచార్య సిఎంకెరెడ్డి, హోసూరుకు చెందిన కొంతమంది తెలుగు ప్రముఖులు అందరూ కలసి మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అందుకు అనుమతించడంతో, తమిళనాడు ప్రభుత్వం ఈ అంశంపై సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో కూడా తెలుగువారు తమ వాదనలను వినిపించడంతో గత ఏడాది మాతృభాషలో పరీక్షలు రాసేందుకు ఇచ్చిన అనుమతిని మరో ఏడాది కొనసాగిస్తూ సుప్రీంకోర్టు తాజాగా ఉత్తర్వులిస్తూ, తుది విచారణను జూన్ 23కు వాయిదా వేసిందని ఆచార్య సిఎంకె రెడ్డి తెలిపారు. తమిళభాషకు తామేమీ వ్యతిరేకం కాదని, తమిళం నేర్చుకునేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన అంటూ, తమిళంతో పాటుగా మాతృభాష అయిన తెలుగును కూడా చదువుకునే అవకాశం రాష్ట్రప్రభుత్వం కల్పించాలని తాము కోరుతున్నామని ఆయన చెప్పారు. మాతృభాష పరిరక్షణ కోసం తాము మరింతగా కృషిచేస్తామని ఆయన తెలిపారు.

తమిళనాడులో తెలుగువారికి పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్న ఆచార్య సిఎంకె రెడ్డి మైనార్టీ భాషల పరిరక్షణ కోసం చేస్తున్న న్యాయపోరాటం తప్పకుండా నెరవేరుతుందని ఇటీవలే చెన్నైకి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఆశాభావం వ్యక్తం చేసివున్నారు కూడా. తెలుగువారంతా మాతృభాష కోసం ఒకేమాట మీద నిలబడితే తమిళనాడు ప్రభుత్వం దిగివస్తుందని కూడా ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగువారి ఆకాంక్షల మేరకు సుప్రీంకోర్టు తీసుకున్న సముచిత నిర్ణయం అందరిలో సంతోషం కలిగిస్తోంది.

# ఆదాలకు..అపూర్వ స్వాగతం

## వందలాది వాహనాలతో నెల్లూరులో భారీ ర్యాలీ



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి సోమవారం సాయంత్రం నెల్లూరు నగరంలో ఘన స్వాగతం లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ బాధ్యతలను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అప్పగించిన తర్వాత నెల్లూరు నగరానికి మొదటిసారి విచ్చేసిన ఆదాలకు స్థానిక నాయకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు తదితర ముఖ్యనాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఆదాలకు అట్టహాసంగా స్వాగతం చెప్పారు. ర్యాలీ కోలాహలంగా సాగింది. బాణ సంచా వేడుకలతో నెల్లూరు ప్రతిధ్వనించింది. నెల్లూరులోని ఆదాల అభిమానులు పలు ప్రాంతాల నుంచి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా బుజబుజ నెల్లూరు నుంచి పెన్నా బ్రిడ్జి వరకు రోడ్డు డివైడర్లలో ఇతర ప్రాంతాల్లోనూ భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు వెలిశాయి. వేదాయ పాళెం సెంటర్లో మాజీ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి, క్రేన్ సాయంతో భారీ గజమాలతో ఆదాలను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ నేత పందిటి సుబ్బయ్య, ఫతేఖాన్‌పేట సెంటర్‌లో కార్పొరేటర్ నూనె మల్లికార్జున యాదవ్ ఎంపీ ఆదాలను గజమాలలతో సన్మానించారు. గద, పూల కిరీటాన్ని ఆయనకు ధరింపజేశారు. ర్యాలీలో భాగంగా, జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు భారీ గజమాలతో ఆదాలను సత్కరించారు. వైసిపి నేత కమలాకర్ రెడ్డి వి.ఆర్.సి సెంటర్లో క్రేన్ సహాయంతో భారీ గజమాల ఎంపీ ఆదాలకు సమర్పించి గౌరవించారు.

## అందరి సహకారంతో.. రూరల్‌ను అభివృద్ధి చేస్తా - ఆదాల



ప్రజలు, నాయకులు, అధికారులందరి సహాయ సహకారాలతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. వైకాపా నెల్లూరు రూరల్ నియోజకవర్గ బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన ఈనెల 6న నెల్లూరు వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి ఆ బాధ్యతలు అప్పగించినందుకు తాను ధన్యవాదాలు చెప్తున్నానన్నారు. ఇప్పుడు గెలిచిన చాలామంది కార్పొరేటర్లు తనకు తెలియదని, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వారిని తన వద్దకు రానివ్వలేదని విమర్శించారు. నెల్లూరు ప్రజలు దౌర్జన్యాన్ని సహించరని, ఇకపై ఆయన ఎటువంటి దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని, ఉక్కుపాదంతో అణిచేస్తామని చెప్పారు. కార్పొరేటర్లపై దౌర్జన్యంచేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకపై తాను నెలలో 20రోజులు నెల్లూరులోనే ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు, జిల్లా పార్టీ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.





# విజయమే లక్ష్యంగా.. ముందుకు సాగాలి

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు

రానున్న ఎన్నికల్లో వైకాపా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైకాపా నాయకుడు, వెంకటగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 6న ఆయన రాపూరు మండలంలోని మద్దెలమడుగులో ఉన్న తెలుగుగంగ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైకాపా విజయం సాధించి, రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టాలని, అందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. వెంకటగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా సిఎం జగన్ తనను నియమించారని ఆయన చెప్తూ, గత ఎన్నికల్లో మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వెంకటగిరి ఎమ్మెల్యే అయ్యేందుకు సిఎం జగన్ సహకరిస్తే, మంత్రిపదవి ఇవ్వలేదనే అక్కసుతో ఆనం ఇప్పుడు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తుండడం దారుణమని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుంచీ ఆనం పార్టీ సిద్ధాంతాలను పక్కనపెట్టి అవినీతి అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నృత్య అకాడమీ ఛైర్‌పర్సన్ శ్రీపిష, నాయకులు దండోలు నారాయణరెడ్డి, బత్తిన పట్టాభిరామిరెడ్డి, శశిధర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఎంఆర్ సంస్థల నుండి.. కొత్తరకం రొయ్యల మేత

## మార్కెట్లోకి విడుదల చేసిన బీద మస్తాన్‌రావు

ప్రస్తుత ఆక్వారంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో బిఎంఆర్ సంస్థ ప్రపంచ ప్రఖ్యాత అంతర్జాతీయ ఆక్వారంగ సంస్థ హింటర్ గ్రూప్ సాంకేతిక సహకారంతో నూతన వనామీ ఫీడ్ బిఎంఆర్ భరోసాను రూపొందించారు.

ఇటీవల నెల్లూరులో దీనిని బిఎంఆర్ సంస్థల ఛైర్మెన్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మార్కెట్లోకి విడుదల చేశారు. బిఎంఆర్ భరోసా వనామి రొయ్యల మేత రూ.67కే రైతు భరోసా కేంద్రాలలో ఆక్వా రైతులకు అందుబాటులో ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలలోని ఆక్వా రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హింటర్ గ్రూప్ ప్రతినిధి, లి బుడి హర్ట్, ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ప్రముఖ ఆక్వారైతులు హనుమంతరావు నాయుడు, శ్రీనాథరెడ్డి, మధుసూదనరెడ్డి, కడివేటి వెంకటరెడ్డిలతో పాటు ఆక్వా కన్సల్టెంట్ డాక్టర్ రవికుమార్, బిఎంఆర్ సంస్థ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



## శ్రీమూలస్థానేశ్వరునికి..
# వేడుకగా పల్లకిసేవ

నెల్లూరు మూలాపేటలో కొలువైవున్న శ్రీ మూలస్థానేశ్వరస్వామికి ఈనెల 6న వేడుకగా పల్లకిసేవ నిర్వహించారు. తొలుత ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఇఓ వేణుగోపాల్, ధర్మకర్తల మండలి ప్రతినిధులు పర్యవేక్షించారు.




# శ్రీసిటీలో ఉత్సాహంగా..5కె-రన్

- కోలాహలంగా జాతీయ సమైక్యతా మారథాన్




యువతలో జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో ఈనెల 5న శ్రీసిటీలో జాతీయ సమైక్యతా మినీ మారథాన్ (5కె రన్)ను ఉత్సాహంగా నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ మారథాన్‌లో శ్రీసిటీలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, పరిశ్రమల ఉద్యోగులు 1000 మందికి పైగా పాల్గొనడంతో కోలాహలంగా ఈ కార్యక్రమం కొనసాగింది. 5కె-రన్‌లో పాల్గొనే వారిని నాలుగు వయో సమూహాలుగా విభజించి, 30 ఏళ్ల పైబడిన వారికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి జెండా ఊపి రన్ ప్రారంభించగా, ఐఐఐటీ-శ్రీసిటీ గవర్నర్ల బోర్డు ఛైర్మెన్ ఎం.బాలసుబ్రహ్మణ్యం, క్రియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.కన్నబిరాన్ ఇతర వయో విభాగాల వారి రన్‌లను ప్రారంభించారు. 5కె రన్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా కొనసాగి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ వద్ద ముగిసింది. జాతీయ సమైక్యతా నినాదాలతో జోరుగా సాగిన మారథాన్ ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మారథాన్ నిర్వాహకులను, అందులో పాల్గొన్న వారందరినీ అభినందించారు. అనంతరం నాలుగు వయో విభాగాల్లో ఒక్కో విభాగంలో మొదటి ముగ్గురు విజేతలకు ముఖ్య అతిధులు బహుమతులు, పాల్గొన్న వారందరికీ డిజిటల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, శ్రీసిటీ డీఎస్పీ జగదీష్‌నాయక్, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి అపూర్వం - డాక్టర్ జీరెడ్డి ప్రసాద్ ప్రశంస




అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్, ఫుట్‌హిల్ అకౌంటబుల్ కేర్ మెడికల్ గ్రూప్ ఛైర్మెన్, ప్రోమెడ్ హెల్త్ కేర్ అడ్మిన్స్ అధ్యక్షుడు డాక్టర్ జీరెడ్డి ప్రసాద్ ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, ఇక్కడ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతిని, ప్రత్యేకతలను, ఉద్యోగ అవకాశాలను ఆయనకు వివరించారు. శ్రీసిటీ ప్రాజెక్ట్ అమలు తీరుపై సంతృప్తి చెందిన డాక్టర్ జీరెడ్డి, శ్రీసిటీ టీమ్ వర్క్‌ను ప్రశంసించారు. వెనుకబడిన ప్రాంతాన్ని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌గా అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ మేనేజ్‌మెంట్ చేస్తున్న కృషి అపూర్వమైనదన్నారు. ఈ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు పుష్కలంగా ఉద్యోగాలు కల్పించడంపై అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక నగరాన్ని నిర్వహించడం అంత తేలికైన పని కాదని, దేశంలోనే అత్యంత ప్రభావశీలమైన పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీని అభివృద్ధి చేసినందుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## శ్రీసిటీని సందర్శించిన.. తెలుగు గంగ సిఇ




తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఇతర సీనియర్ ఇంజనీర్ల బృందంతో కలిసి ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో తీసుకుంటున్న నీటి సంరక్షణ చర్యలు, వర్షపు నీటి సేకరణ, పరిశ్రమలకు నీటి అవసరాలు, మురుగునీటి శుద్ధి మరియు పునర్వినియోగం గురించి ఆయనకు వివరించారు. తెలుగు గంగ ప్రాజెక్టు నుండి నీటి కేటాయింపులు, ఇతర సంబంధిత అంశాలను ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ సమీక్షించారు. ఈ పర్యటనలో శ్రీకాళహస్తి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం కూడా ఉన్నారు.

# ఎన్‌బికెఆర్‌కి ఎన్‌బిఏ గుర్తింపు



కోట మండలం ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ కోర్సులకు 'నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్' గుర్తింపు టైర్ -1 స్థాయిలో లభించినట్లు కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి ఇటీవల విలేకరులకు తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు ఈ గుర్తింపు లభించినట్లు ఆయన చెప్పారు. ఈ గుర్తింపు 2022-23 విద్యా సంవత్సరం నుండి 2024-25 వరకు మూడు సంవత్సరాల పాటు వర్తిస్తుందన్నారు.

గత సంవత్సరం నవంబర్ 18, 19, 20 తేదీల్లో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి అనేక రంగాలలో నిష్ణాతులైన తొమ్మిది మంది ప్రొఫెసర్లు ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించి వారి నివేదికను ఢిల్లీలోని ఎన్‌బిఏ ప్రధాన కార్యాలయానికి పంపారని, వివిధ దశల్లో మూల్యాంకనం పూర్తయిన తర్వాత ప్రధాన కార్యాలయం నుండి గుర్తింపు లబించినట్లు తమకు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఎన్‌బికెఆర్‌కు 'ఎ'గ్రేడ్‌తో న్యాక్ గుర్తింపు కూడా ఉన్నట్లు తెలిపారు.

ఈ గుర్తింపు సాధించడం పట్ల కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తమ కళాశాల సిబ్బందికి అభినందనలు తెలిపారన్నారు.

# సమస్యలకు త్వరలోనే పరిష్కారం

**- రామ్‌కుమార్‌రెడ్డి**



తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

గూడూరు డివిజన్‌లో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్, వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ఆర్డీవో కిరణ్‌కుమార్‌తో కలసి సమీక్షించారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. మరోవైపు ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే దూరంగా ఉండటం విశేషం! రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ మేరిగ మురళి, డిఎస్పీ సూర్య నారాయణరెడ్డి, రూరల్ సిఐ జి.దశరథ రామారావు, టూటౌన్ సి.ఐ వెంకటేశ్వర రావు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

**మాజీమంత్రి సోమిరెడ్డి**



తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, గతంలో తెలుగు దేశం పార్టీచేసిన అభివృద్ధి తప్ప ప్రస్తుతం ఎక్కడా తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, బీద రవిచంద్రయాదవ్‌లు ఆరోపించారు. గూడూరు ఇందిరానగర్ ప్రాంతంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టిన పాదయాత్రను మాజీమంత్రి పరసా రత్నం, తెలుగుదేశం తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, మాజీ జడ్పీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్‌తో కలసి ఈ నెల 6న ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఇక్కడ సిలికాతో వాటి యజమానులే సొంతంగా వ్యాపారం చేసుకునేవారని, ఇప్పుడు కేవలం జగన్‌మోహన్‌రెడ్డి అనుచరులకు మాత్రమే వారు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మాజీఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గూడూరు నియోజకవర్గానికి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని, పాదయాత్రలో తన వద్దకు వచ్చేవారు తెలిపే సమస్యలను టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



# దివ్యాంగులకు చేయూత

గూడూరు, డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 5వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'కీ.శే సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి దివ్యాంగుల చేయూత' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 20 మంది దివ్యాంగులకు ఒక నెలకు సరిపడా పల సరుకులను పంపిణీ చేయడం జరిగింది. సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, సిద్ధారెడ్డి వెంకటసుధీర్‌రెడ్డి దాతృత్వంతో ఈ కార్యక్రమం ప్రతినెలా క్రమం తప్పకుండా జరుగుతోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, డి.ప్రజేందర్‌రెడ్డి, కె.సనత్‌రెడ్డి, కె.రాఘవ రెడ్డి, ఎం.జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# వికలాంగులకు 'రెడ్' నిత్యావసర వస్తువులు




గూడూరు, త్యాగరాజ వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో 'రెడ్' సంస్థ, ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళామండలి సహకారంతో 37మంది పేద వికలాంగులకు ఇటీవల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కనుమూరి సుందరరామిరెడ్డి జ్ఞాపకార్థం కనుమూరి సీతారెడ్డి దాతృత్వంతో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డా.రోహిణి పాల్గొన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి జీవనిరెడ్డి, విష్ణువందన, నాగసూరు లక్ష్మీ, ఇంద్రసేనమ్మ, 'రెడ్ సంస్థ' ప్రెసిడెంట్ జానా సుధీర్ పాల్గొన్నారు.

## కళాత్మక సినిమాల సృష్టికర్త

# కనుమరుగైపోయారు



## విశ్వనాథ్ మరణంతో శోకసంద్రమైన సినీలోకం

గుండెల్ని పిండేసే అత్యద్భుత సన్నివేశాలతో, మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయే కళాత్మక దృశ్యాలతో, పదికాలాలపాటు నిలిచిపోయే కథాకథనాలు, సంభాషణల సొబగులతో తెలుగు సినీ పరిశ్రమకే ప్రపంచస్థాయి కీర్తితెచ్చిన దర్శకులు ఎవరైనా ఉన్నారంటే..అది ఒక్క విశ్వనాథ్ మాత్రమేనన్నది జగమెరిగిన సత్యం. ఎన్నిసార్లు చూసినా తనివితీరని చిత్రాలు తీసిన కళాబ్రహ్మ ఆయన. జీవనజ్యోతి, చెల్లెలి కాపురం, నిండుహృదయాలు, కాలం మారింది, శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం, సిరిసిరిమువ్వ, శృతిలయలు, సిరివెన్నెల, సప్తపది, ఆపద్బాంధవుడు, స్వర్ణకమలం లాంటి అద్వితీయ చిత్రాలను ఎవరు మరచిపోగలరు?...సినిమా అంటే కళాత్మకంగా, నవరసభరితంగా ఉండాలని, సందేశం ఉండాలని తపించి తీసిన సినిమాలు కనుకనే అవి నాటికీ, నేటికీ, ఏనాటికీ మాసిపోని చిత్రాలుగా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి. విశ్వనాథ్ దర్శకత్వంలో సినిమా వచ్చిందంటే చాలు, ప్రేక్షకులు మైమరచిపోతారు. ఎందుకంటే ఆయన సినిమాలు విలక్షణమైనవే కాక, విశిష్టమైనవి కూడా. ఏ చిత్రం తీసినా, కథ ఎలాంటిదైనా సరే.. దేనికదే సాటి..లేదు పోటీ అన్నట్లుగా ఉండేలా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. ఇక అలాంటి అమోఘమైన చిత్రాలను మనం చూడగలమా?.. మానవీయ విలువలన్నీ మూటగట్టి, సంగీతం, నృత్యం, సాహిత్యం వంటి కళాసుమాలన్నిటినీ తెచ్చి, సుమనోహర మాలలుగా కట్టి..తెలుగుతల్లికి కంఠాభరణంగా సమర్పించిన మహాదర్శకుడు విశ్వనాథ్. క్యాబరే డ్యాన్సులు, తలబొప్పి కట్టించే ఫైటింగులు, అశ్లీలం వెల్లువెత్తే ఐటం సాంగులతో హోరెత్తుతూ..తెలుగుసినిమా ఎటుపోతోందో కూడా తెలియని నేటికాలంలో, నైతిక విలువలు, మమతలు, మానవీయతలు, మన పల్లెల అందచందాలతో నిండిన అలాంటి మంచి సినిమాలను ఇక తీసేవారెవరూ?..తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలిపేవారెవరూ?..ఆ కళాతపస్వితో పాటు అవన్నీ కూడా ఇక తెరమరుగైనట్లేనా?... వెండితెర ఇక వెలవెలబోయినట్లేనా?...

*అపురూప చిత్రాల దర్శకుడు..కళాతపస్వి కె.విశ్వనాథ్ ఫిబ్రవరి 2న కన్నుమూయడంతో సినీలోకం శోకసంద్రంలో మునిగిపోయింది. 92 ఏళ్ళ వృద్ధాప్యంలో అనారోగ్యం బారినపడి ఆయన హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తెలుగువారి కీర్తిశిఖరం ఒరిగిపోయినట్లయింది. సినీరంగంలో ప్రవేశించాక తొలి చిత్రమే (ఆత్మగౌరవం) నంది అవార్డు సాధించిదంటే ఆయన దర్శకత్వ ప్రతిభ అలాంటిది. ఏ చిత్రం తీసినా తనదైన ప్రత్యేకతతో 'దటీజ్ విశ్వనాథ్' అనిపించుకునేలా మహోన్నతమైన సినిమాలను ఆయన మనకందించారు. కళాత్మకతకు, నైతిక విలువలకు, మానవీయ సంబంధాలకు, ప్రేమలు-అభిమానాలకు ఆయన పెద్దపీట వేశారు. తెలుగు సినిమాకు అంతర్జాతీయస్థాయి గౌరవాన్ని తెచ్చిన దర్శకబ్రహ్మ ఆయన. కళాత్మకతకు నిలువెత్తు రూపమైన పద్మశ్రీ కాశీనాథుని విశ్వనాథ్..తన దర్శకత్వంలో అత్యద్భుతంగా నిర్మించిన శంకరాభరణం' సినిమా విడుదలైన ఫిబ్రవరి 2వ తేదీనే (1980) అనంతలోకాలకు తరలిపోవడం విధి లీల. ఆయన లేని లోటు తీర్చగలిగినవారు మనకికె ఎవరున్నారు?.. తెలుగు చిత్రపరిశ్రమకే కాదు.. తెలుగువారికి కూడా ఆయన లేని లోటు ఏనాటికీ తీరనిది.*

### తండ్రి బాటలో తనయుడు

బాపట్ల జిల్లా రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో 1930 ఫిబ్రవరి 19న కాశీనాథుని సుబ్రహ్మణ్యం-సరస్వతి దంపతులకు జన్మించిన విశ్వనాథ్‌కు తండ్రే ఆదర్శం. గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్, ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో బిఎస్సీ పూర్తిచేశాక, తన తండ్రి చెన్నైలో విజయవాహినీ స్టూడియోలో పనిచేస్తుంటే, అదే స్టూడియోలో ఆయన సౌండ్ రికార్డిస్ట్‌గా సినీరంగంలో ప్రవేశించారు. పాతాళభైరవి సినిమాకు అసిస్టెంట్ రికార్డిస్ట్‌గా పనిచేసిన విశ్వనాథ్, పలు చిత్రాలకు కథారచనలోనూ తోడ్పడ్డారు. 1965లో దుక్కిపాటి మధుసూదనరావు, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావులు ఆయనకు దర్శకునిగా అవకాశం కల్పించడం కలసివచ్చిన అదృష్టమైంది. తొలి చిత్రంగా విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఆణిముత్యం 'ఆత్మగౌరవం' సినిమాకు నంది అవార్డు కూడా లభించింది. ఇక అక్కడినుంచీ విశ్వనాథ్ తిరుగులేని దర్శకునిగా రాణించారు. తెలుగుసినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసే ఎన్నో అద్భుత చిత్రాలకు దర్శకత్వం వహించి దర్శకత్వంలో తనకు తనే సాటి అనిపించుకున్నారు. సూపర్‌హిట్ చిత్రాల దర్శకునిగా రాణించారు. తన సినీజీవిత ప్రస్థానంలో 50కి పైగానే చిత్రాలకు దర్శకత్వం వహించి అనర్ఘరత్నాల వంటి సినిమాలను ప్రేక్షకులకు అందించారు. విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభకు మెచ్చి కేంద్ర ప్రభుత్వం 1992లో ఆయనకు 'పద్మశ్రీ' అవార్డునిచ్చి ఘనంగా సత్కరించింది. దాదాసాహెబ్‌పాల్కే అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డుల వంటి ప్రతిష్టాత్మకమైన అవార్డులెన్నో ఆయన కీర్తిని మరింత ఇనుమడించాయి. 5 జాతీయ అవార్డులు, 5 నంది అవార్డులు, 10 ఫిలిమ్ ఫేర్ అవార్డులు ఆయన్ను వరించాయి. తెలుగు విశ్వవిద్యాలయం.. ఆయన్ను గౌరవ డాక్టరేట్‌తో గౌరవించి తనను తాను గౌరవించుకుంది.

## 'లాయర్'ను అభినందించిన.. దర్శకబ్రహ్మ



'ఇదీ సాంబమూర్తి కథ' ఆవిష్కరణోత్సవంలో కళాతపస్వి విశ్వనాథ్

నెల్లూరును మరో తిరువయ్యార్ చేసిన మహనీయుడు.. శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి జీవితంపై 'ఇదీ సాంబమూర్తి కథ' పేరుతో 'లాయర్' పత్రిక రూపొందించిన ప్రత్యేకసంచిక ఆవిష్కరణ మహోత్సవం, స్వచ్ఛభారత్, స్వచ్ఛ సంగీతం కార్యక్రమాలు నెల్లూరులో 2015 అక్టోబరు 3న అద్వితీయంగా జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆ పుస్తకాన్ని చూసి విశ్వనాథ్ మురిసిపోయారు. విశ్వవిఖ్యాత గాయకుడు, నెల్లూరు ముద్దుబిడ్డ, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రిగారైన సాంబమూర్తి జీవిత ప్రస్థానం ఒక పుస్తకంగా రావడం ఆయనకెంతో సంతోషం కలిగించింది. 'లాయర్' పత్రిక అధినేత ప్రభు(తుంగా శివప్రభాత్‌రెడ్డి)ను మంచి కార్యక్రమాలు చేస్తున్నారంటూ దీవించారు. ఈ ఆవిష్కరణలో పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో పాటు, అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న, పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, నెల్లూరుతోనూ, ప్రత్యేకించి బాలుతోనూ అనుబంధం ఉన్న విఖ్యాతనటుడు కమల్‌హాసన్‌లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబమూర్తి గారితో ఉన్న ఆత్మీయాను బంధాన్ని విశ్వనాథ్ గుర్తుచేసుకున్నారు. "శంకరాభరణం చిత్రం బిందురూపంలో ఉన్నప్పుడు మొట్టమొదటి శ్రోత మా బాబాయిగారైన శ్రీ సాంబమూర్తి గారే. నేను దర్శకత్వం వహించి, తెలుగుసినిమాల్లో చరిత్ర సృష్టించిన 'శంకరాభరణం' కథను విని ఆశీర్వదించిన తొలివ్యక్తి ఆయనే'నంటూ మా బాబాయి ప్రోత్సాహాన్ని మరచి పోలేనన్నారు. ఆరోజున జరిగిన శ్రీ సాంబమూర్తి గారి విగ్రహావిష్కరణ, 'ఇదీ సాంబమూర్తి కథ' ఆవిష్కరణతో పాటు మహనీయులైన ఎస్పీబాలసుబ్రహ్మణ్యం, విశ్వనాథ్‌ల ఆశీస్సులందుకోవడం 'లాయర్' ప్రస్థానంలో ఏనాటికీ మరుపులేని, మరువలేని జ్ఞాపకాలే!

## 124 కేంద్రాల్లో ధాన్యం సేకరణ - జేసీ కూర్మనాథ్

జిల్లాలో ఫిబ్రవరి నెలాఖరు నుంచి వరికోతలు మొదలవుతాయని, రైతులకు మద్దతు ధర ఇచ్చి, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఆదేశించారు. ఈనెల 7న ఆయన సంగం మండలంలోని కొరిమెర్ల గ్రామంలో గ్రామ సచివాలయాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లా నుంచి ఈసారి 1.6 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఎదురు కాకుండా సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, జిల్లాలో 124 ధాన్యం సేకరణ కేంద్రాల్లో ధాన్యాన్ని సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

## టూకీగా...



### మాలకొండ ఆదాయం.. రూ.9.7 లక్షలు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మాలకొండలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి ఈనెల 4న శనివారం ఒక్క రోజునే భక్తుల కానుకలు, సేవాటిక్కెట్ల విక్రయం తదితరాల ద్వారా 9,71,567 రూపాయల మేరకు ఆదాయం వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

### బుచ్చిరెడ్డిపాళెంకు.. కొత్త డీటీగా విజయకుమార్

బుచ్చిరెడ్డిపాళెం డెప్యూటి తహశీల్దారుగా కె.విజయకుమార్ ఈనెల 6న బాధ్యతలు చేపట్టారు. కలిగిరిలో పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు బుచ్చికి బదిలీ చేశారు.

### వృద్ధులకు కంటిపరీక్షలు

కొండాపురం మండలంలోని బోయిళ్ళవారిపాళెం పాఠశాలలో ఈనెల 6న వైఎస్సార్ కంటివెలుగు పథకం కింద 60 ఏళ్ళు దాటిన వృద్ధులకు కంటిపరీక్షలు నిర్వహించారు. నేత్ర వైద్యులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, కొండాపురం ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ నసీరుద్దీన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బద్దిపూడి మాచర్ల పర్యవేక్షించారు.

### జొన్నవాడ కామాక్షితాయికి.. లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఈనెల 7న అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మండపంలో కొలువుదీర్చి 20మంది రుత్విక్కులతో ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### రామచంద్రాపురంలో.. చిరుధాన్యాల సాగుపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచంద్రాపురంలో ఈనెల 7న 'మహిళల స్వావలంబన- సాధికారత శిక్షణా శిబిరం'లో పాల్గొన్న వ్యవసాయశాఖ డిడిఏ శివనారాయణ మహిళలకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. జొన్న, రాగి, కొర్రలు, అరికలు తదితర చిరుధాన్యాల సాగు లాభదాయకమన్నారు. ఏరువాక కోఆర్డినేటర్ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

### వేదాయపాళెం ఎస్ఐగా.. రాజ్‌కుమార్

నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా రాజ్‌కుమార్ ఈ నెల 7న బాధ్యతలు చేపట్టారు. విఆర్‌లో ఉన్న రాజ్‌కుమార్‌ను ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా వేదాయపాళెంకు పంపుతూ జిల్లా ఎస్పీ విజయారావు ఉత్తర్వులిచ్చారు. రాజ్‌కుమార్ గతంలో గుంటూరుజిల్లా చేబ్రోలు ఎస్ఐగా విధులు నిర్వహించారు. కొత్త ఎస్ఐకి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### పాతబంగారుపాళెంలో.. పాముకాటుకు మహిళ మృతి

బోగోలు మండలంలోని జువ్వలదిన్నె పంచాయతీలోని పాతబంగారుపాళెంకు చెందిన మాజీ కాపు మునెయ్య భార్య ముత్యాలమ్మ(54) పాముకాటుకు గురై ఈనెల7న మృతి చెందింది. గొర్రెలను మేతకు తీసుకువెళ్తుండగా పాము కాటేసింది. చికిత్సకోసం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించింది.

### మనుబోలు జడ్పీస్కూల్‌ను సందర్శించిన ఆర్‌జేడి

మనుబోలులోని జడ్పీహైస్కూల్‌ను ఈనెల 7న విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు సందర్శించి విద్యాప్రగతిని సమీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిసారించి టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని ఆయన ఉపాధ్యాయులకు చెప్పారు.

### జెండాదిబ్బలో తాళాలు పగులగొట్టి చోరీ

సంగం మండలం జెండాదిబ్బలో ఇటీవల దొంగలు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న ఏడుసవర్ల బంగారు నగలు, 10 వేల రూపాయల డబ్బును మూటగట్టుకుపోయారు. రేషన్ డీలర్‌గా ఉన్న షన్ముఖ ఇంటికి తాళం వేసి ఉండగా, దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజకీయ చట్రంలో రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు ఉంటుందని విభజన ఒప్పందంలో పేర్కొన్నప్పటికీ... ఒకసారి రాష్ట్రం విడిపోయాక ఇక హైదరాబాదు మనది కాదు అన్న బాధ, భావన ప్రతి ఆంధ్రుడి మనసులో బలంగా నాటుకుపోయాయి. ఇదే తరుణంలో ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాత్రికి రాత్రే అమరావతిని రాజధానిగా నిర్ణయించి ప్రకటించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీని తీసుకొచ్చి రాజధానికి భూమిపూజ చేయించారు. ఆ తరువాత ఆంధ్రా ప్రభుత్వ యంత్రాంగాన్ని శరవేగంగా వెలగపూడికి తరలించారు. 2014 – 2019 సంవత్సరాల మధ్య 5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న బాబు పాలనలో శాశ్వత నిర్మాణాలకంటే తాత్కాలిక నిర్మాణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నిజానికి అయిదేళ్ల కాలంలో ఒక మంచి శాశ్వత సచివాలయం, అద్భుతమైన అసెంబ్లీ భవనాలను కూడా నిర్మించుకోలేకపోయారు. తమ సొంతానికి సైతం ఒక ఇల్లు కూడా కట్టుకోలేదు. పైగా, రాజధాని పేరుతో వేలకోట్ల రూపాయలను అక్రమంగా వెనుకేసుకున్నాడన్న అపవాదుని మూటగట్టుకున్నారు. తమ సామాజికవర్గ ప్రయోజనాల కోసమే అమరావతిని రాజధానిగా ప్రకటించారన్న నింద కూడా ఇప్పటికీ మోస్తున్నారు. పేరుకి అమరావతిని రాజధాని అని ప్రకటించినా అక్కడ శాశ్వతంగా ఎలాంటి మౌళిక సదుపాయాలు కల్పించకుండా కాలక్షేపంచేసి అయిదు సంవత్సరాలు గడిపేశారు నారా బాబులు.

2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. ఆయన పార్టీ గెలవకముందే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నారు. తాను ముఖ్యమంత్రిని కావడం ఖాయం అన్న ధీమాతోనే తన ఇంటికీ, క్యాంపు కార్యాలయానికి రూపకల్పన చేసుకున్నారు. పార్టీ అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష నాయకుడి హోదాలో అసెంబ్లీలో సైతం తన మద్దతు అమరావతికే అని ప్రకటించారు. అందుకోసమే తానూ సొంతంగా ఇల్లు కూడా కట్టుకుంటున్నానని ప్రకటించారు. అయితే, జగన్ అధికారంలోకి వచ్చిన కొద్దినెలలకే అసంబ్లీ సాక్షిగా మూడు రాజధానుల ప్రతిపాదన తెరపైకి తేవడం అందరినీ ఆశ్చర్యపరచింది. ఇది ఎవరూ ఊహించని పరిణామం. ముఖ్యమంత్రి ఇక్కడే ఇల్లు కట్టుకున్నారు. అప్పట్లో అసెంబ్లీలో సైతం అమరావతికే వత్తాసు పలికారు కాబట్టి రాజధాని తరలిపోయే అవకాశమేలేదని చాలామంది భావించారు. కానీ, వారి ఊహలన్నీ తారుమారు చేస్తూ రాజధాని మార్పు ఆలోచనను బయటపెట్టారు జగన్. జగన్‌మోహన్‌రెడ్డి మార్కు నిర్ణయాలకు ఇది మరో ఉదాహరణ. తాను చేయదలచుకుంది చేయడం, చెప్పదలచుకుంది ఖరాఖండిగా చెప్పేయడం ఆయన నైజం. తన మదిలోని ఆలోచనను ఆయన ముందుగా ఎవరి ముందు బయటపెట్టారు, ఎవరితోనూ చర్చించరు. ఇదే తరహాలో తన సహచర మంత్రులు, అధికారులు, సలహాదారులు ఉలిక్కిపడేలా 3 రాజధానుల నిర్ణయాన్ని అసెంబ్లీలో ప్రకటించారు.

అప్పటినుండే ఆట మొదలయ్యింది. విషయం కోర్టుకి ఎక్కింది. నిర్ణయం అటకెక్కింది. త్వరలో విశాఖ నుండే పరిపాలన అని తరచూ జగన్‌మోహన్‌రెడ్డి చెప్తూనే ఉన్నారు. తాజాగా ఢిల్లీలోకూడా ఇదేపాట పాడారు. కేంద్రపెద్దలు మాత్రం తమ మాట మార్చడం లేదు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతే అంటూ పదేపదే చెప్తూనే ఉన్నారు. కోర్టులు కూడా ఈ వ్యవహారంలో స్పష్టత ఇవ్వడంలేదు. రాజధాని ఎక్కడని నిర్ణయించే అధికారం రాష్ట్రప్రభుత్వానికే ఉందని మాత్రమే అంటున్నాయి తప్ప... రాజధాని విషయంలో వచ్చే ఫిర్యాదులను, కేసులను పరిష్కరించకుండా వాయిదాలు వేస్తూనే ఉన్నాయి.

మొత్తంమీద రాజకీయ చట్రంలో రాజధాని ఇరుక్కుంది. తమ స్వార్థంకోసం రాజకీయ పార్టీలు, తమ పవిత్రత కోసం కొన్ని వ్యవస్థలు ఎవరికివారే ఆంధ్రా ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నాయి. ఎప్పటికప్పుడు వచ్చే తాత్కాలిక నిర్ణయాలను తమ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. రాష్ట్రం విడిపోయి తొమ్మిదేళ్ళు అయ్యింది. ఇప్పటివరకు రాజధాని విషయంలోనే ఆంధ్రులకి స్పష్టత లేదు. అనాధగా మారి అగాధంలో పడిపోయిన ఆంధ్రా భవిష్యత్తుపై భరోసా లేదు. మరో ఏడాదిలో మళ్ళీ ఎన్నికలు వస్తాయి. విభజన ఒప్పందం ప్రకారం పది సంవత్సరాలు కూడా పూర్తయిపోతాయి. హైదరాబాదుపై శాశ్వతంగా మన హక్కుని కోల్పోతాం. ఈ క్రమంలో ప్రజలు రాష్ట్రం వదిలిపోతున్నారు, పరిశ్రమలు వలసబాట పట్టాయి, పెట్టుబడులు తరలిపోతున్నాయి...! ఆంతా గందరగోళం, అయోమయం, అగమ్యగోచరం...!

# రాపూరు వద్ద రోడ్డు ప్రమాదం



సిద్ధార్థ (ఫైల్‌ఫోటో)

## తండ్రితో సహా ఇద్దరు బిడ్డలు దుర్మరణం

విధి బలీయమైనదంటారు పెద్దలు. తలరాతను ఎవరూ తప్పించలేరంటారు కూడా. నిజమే!.. మొన్నటికి మొన్న రాపూరు మండలంలోని వెలుగోను జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం దుర్ఘటనలో తండ్రితో పాటు, ఇద్దరు బిడ్డలు మరణించడం జిల్లా ప్రజలను కలచివేసింది. రాపూరు మండలం గుండవోలు గ్రామానికి చెందిన గంగోడి ప్రతాప్ తన ఇద్దరు పిల్లలతో కలసి మోటార్‌బైక్ మీద ఇంటికి వస్తున్నారు. జాతీయరహదారిపై వస్తున్న ఓ కారు అదుపుతప్పి మోటార్‌బైక్‌ను ఢీకొట్టడం, బైక్‌పై వస్తున్న తండ్రి ప్రతాప్, 14 ఏళ్ళ వయసున్న ఆయన కుమార్తె వైష్ణవి.. అక్కడికక్కడే రక్తగాయాలతో మరణించడం.. చూడండి ఎంత ఘోరమో!.. మరో బిడ్డ, సిద్ధార్థకు కూడా తీవ్రగాయాలు తగిలాయి. ఈ సమాచారం తెలుసుకున్న రాపూరు ఎస్‌ఐ క్రాంతికుమార్ హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, చావు బతుకుల్లో ఉన్న సిద్ధార్థను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరుసటిరోజే ఆ బిడ్డ కూడా మరణించాడు. దీంతో ఆ కుటుంబం, బంధువులు అందరూ శోకసాగరంలో మునిగిపోయారు. భర్తను, బిడ్డలను కోల్పోయిన ఆ తల్లి వేదన, రోదన వర్ణనాతీతం.

# ఆదాల కోటవైపు.. కోటంరెడ్డి కోటరీ!

(మొదటి పేజీ తరువాయి)

## సర్పంచ్‌లు - ఎంపిటీసీలు



వైసీపీ రూరల్ నియోజకవర్గంలో అత్యంత ప్రధాన నాయకుడిగా పార్టీ భావించే ఆనం విజయకుమార్‌రెడ్డి 8వతేది బుధవారం ఆదాల ఇంట్లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. రూరల్ నియోజక పరిధిలో వున్న 18 గ్రామాల సర్పంచులలో 90శాతం మందితో పాటు దాదాపుగా అందరు రూరల్ ఎంపిటీసీల చేత కూడా జై జగన్ అనిపించారు.



## 16మంది కార్పొరేటర్లు - ముఖ్య నేతలు

9వతేది గురువారం ఉదయం మంత్రి కాకాణి కూడా ఆదాల ఇంట్లో నగర కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. రూరల్ పరిధిలో 26మంది కార్పొరేటర్లు ఉంటే వారిలో 16మంది ఆదాల గూటికి చేరారు. తామంతా వైసీపీతోనే ఉంటామని ముక్తకంఠంతో నినదించారు. ఆదాలను కలిసిన వారిలో 1వ వార్డు కార్పొరేటర్ జానా నాగరాజగౌడ్, 2వ వార్డు కార్పొరేటర్ పి.రామ్మోహన్ యాదవ్, 17వవార్డు కార్పొరేటర్ పెనేటి సుధాకర్, 18వవార్డు కార్పొరేటర్ టి.అశోక్‌కుమార్ నాయుడు, జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, 21వ వార్డు కార్పొరేటర్ మొయిళ్ళ గౌరీ, 22వ వార్డు కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి, 23వ వార్డు కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, 29వ వార్డు కార్పొరేటర్ షేక్ సత్తార్, 30వ వార్డు కార్పొరేటర్ కూకటి ప్రసాద్‌యాదవ్, 32వవార్డు కార్పొరేటర్ తాళ్లూరి అవినాష్, 34వవార్డు కార్పొరేటర్ షమీద, ఆమె భర్త రియాజ్, 35వ వార్డు కార్పొరేటర్ యాకసిరి వాసంతి, ఆమె భర్త శరత్‌చంద్ర, 36వవార్డు కార్పొరేటర్ పిండి శాంతిశ్రీ ఆమె భర్త పిండి సురేష్, 37వవార్డు కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, 38వవార్డు కార్పొరేటర్ దాసరి అమృత, ఆమె భర్త రాజేష్, 41వవార్డు కార్పొరేటర్ కువ్వాకుల విజయలక్ష్మి ఉన్నారు.

నిన్నటివరకూ శ్రీధర్‌రెడ్డికి తోడుగా ఉండిన సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సుబ్బారెడ్డి, హరిబాబుయాదవ్, యేసునాయుడు, కోడూరు కమలాకర్ వంటివాళ్ళు కూడా నాయకుడెవరైనా... తాము పార్టీకే అండగా ఉంటాం అంటూ ఆదాల పంచన చేరారు.

## ఆలయ ఛైర్మెన్లు

నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఛైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఛైర్మెన్, ఆదాల ప్రభాకరరెడ్డికి ప్రియశిష్యుడు రావు శ్రీనివాసరావు, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఛైర్మెన్ దొరబాబులు కూడా పార్టీ అజెండాయే తమ జెండా అంటూ



ఆదాలకు జైకొట్టారు. త్వరలో మరికొంతమంది కూడా ఆదాల గూటికే చేరనున్నారని సమాచారం.

## అది ట్యాపింగ్ కాదు రికార్డింగే...



తన మిత్రుడితో మాట్లాడుతుంటే తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించిన శ్రీధర్‌కి మరో షాక్ తగిలింది. శ్రీధర్‌తో మాట్లాడిన ఆయన చిరకాల మిత్రుడు లంకా రామశివారెడ్డి కూడా మీడియా ముందుకొచ్చాడు. ఫోన్ ట్యాపింగ్ నిజం కాదని, తన మిత్రుడు శ్రీధర్‌తో తాను మాట్లాడిన ఫోన్ సంభాషణ తప్పనిసరి పరిస్థితులలో మరో మిత్రుడికి పంపానని, అది వైరల్ అయ్యిందని చెప్పాడు. తాను చేసిన పొరపాటు ఇంతపెద్ద దుమారాన్ని లేపుతుందని ఊహించలేదని చెప్పాడు.

లంకా రామశివారెడ్డి డాక్టర్ రాజశేఖరరెడ్డికి ముఖ్య శిష్యుడు. వైఎస్సార్ శిష్యుడిగా అప్పట్లో జిల్లా కాంగ్రెస్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా వ్యాపారరంగంలో సిరపడ్డాడు. రాజశేఖరరెడ్డి కుటుంబంపై వున్న అభిమానంతో వాస్తవాలని వెల్లడించడానికి మీడియా ముందుకి వచ్చానని చెప్పాడు. శ్రీధర్‌రెడ్డి చెప్పినట్లుగా తనది ఐ ఫోన్ కాదని, యాండ్రాయిడ్ అని, తనకు వచ్చే ప్రతీ కాల్ రికార్డ్ అవుతుందని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశాడు. ఈ సంఘటనతో శ్రీధర్ పూర్తిగా అబాసుపాలైపోయాడు. శ్రీధర్ చెప్పిన దాంట్లో నిజం ఉందా...? లేదా..?? అని అనుమానమున్నవారికి రామశివారెడ్డి మాటలతో క్లారిటీ వచ్చినట్లుగా అయ్యింది.

## శ్రీధర్‌కి నాగసాధువు ఏం చెప్పాడు..?

గత ఏడాది వినాయకచవితి సందర్భంగా ఇరుకళల అమ్మవారి ఆలయం వద్ద 'గణేష్ ఘాట్' ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న శ్రీధర్‌రెడ్డి వద్దకు వచ్చిన నాగసాధువు ఒకరు నీకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంది, మంత్రివి కూడా అవుతావు అని చెప్పినట్లుగా వార్తలలో వచ్చింది. అయితే నువ్వు పార్టీ మారితే మంత్రివి అవుతావు అని ఆ సాధువు చెప్పాడా...? అందుకోసమే కోటంరెడ్డి ఇప్పుడు పార్టీ మారాడా..?? అని అయన పక్కన ఉన్నవారే గుసగుసలాడుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమయ్యింది. ఒకవేళ అదే నిజమైతే రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం గెలుస్తుందన్న ధీమా కూడా శ్రీధర్‌రెడ్డిలో కలిగిందా అని కూడా అంటున్నారు.

మొత్తానికి కోటంరెడ్డి కోటరీ అంతా ఆదాల కోటవైపు చూస్తోందని రాజకీయ వర్గాలు, వైసీపీ శ్రేణులు చెప్తున్నారు.

# రూరల్‌కు నేనే అభ్యర్థిని.. దమ్ముంటే నిలబడు

## - ఆదాల సవాల్



'నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి నేనే అభ్యర్థిని. దమ్ముంటే నిలబడి నాతో పోటీ చెయ్'.. అంటూ నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డినుద్దేశించి సవాల్ విసిరారు. ఈనెల 9న గురువారం ఆయన నెల్లూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధిష్టానం తనకు రూరల్ స్థానాన్ని కేటాయిస్తుందని ఆదాల ధీమా వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశాల్లో పచ్చి అబద్దాలు చెప్పడం, నాటకాలాడడం శ్రీధర్‌రెడ్డికి మామూలేనని, మూడున్నరేళ్ళుగా శ్రీధర్‌రెడ్డి చేసిన అన్యాయాలు, అరాచకాలు బయటపడుతున్నాయని, వాటిని ప్రజలకు ఒకటొకటిగా వివరిస్తామని చెప్పారు. వ్యాపారులను, రియల్టర్లను ఎలా వేధించాడో అందరికీ తెలుసన్నారు. 'నేను కాంట్రాక్ట్ రంగం నుంచి వచ్చి, గత పాతికేళ్ళుగా మచ్చలేని రాజకీయాలు చేస్తూ ప్రజాసేవలో ఉన్నా.. ఆయన ప్రజాసేవ కోసం వచ్చి.. దందాలు చేస్తున్నాడు.' అదీ మా ఇద్దరికీ తేడా అని ఆదాల విమర్శించారు.



# సుస్వర బాణి.. రాగాల రాణి.. 'వాణి' ఇకలేరు

## కన్నుమూసిన వాణీజయరామ్

**తీయని గొంతు మూగబోయింది. కమ్మని గానవాహిని ఆగిపోయింది. 2023 ఫిబ్రవరి నెల.. కేవలం రెండురోజుల వ్యవధిలోనే తెలుగుసినిమా రంగానికి కొత్తఊపిరులూదిన ఇద్దరు ప్రముఖులను తిరిగిరాని లోకాలకు తరలించుకుపోయింది. కళాతపస్వి కె.విశ్వనాథ్ ఫిబ్రవరి 2న కన్నుమూసిన విషాదం నుంచి తేరుకోకముందే, ఫిబ్రవరి 4న విఖ్యాత గాయని వాణీజయరామ్ మృతిచెందడం తెలుగుసినీజగత్తుకు తీరని శోకం మిగిల్చింది. 14 భారతీయ భాషల్లో వేలాది పాటలను అలవోకగా, శ్రుతిపక్వంగా పాడి ప్రేక్షకలోకాన్ని ఉర్రూతలూగించిన మహాగాయని.. వాణీజయరామ్ ఇక లేకపోవడం దురదృష్టకరం.**

తమిళనాడులోని వెల్లూరులో జన్మించిన వాణీజయరామ్, తల్లితండ్రులు దురైస్వామి-పద్మావతిల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్నారు. పద్మావతి తల్లి స్వస్థలం కర్నూలు కావడంతో, వాణీజయరామ్‌కు తెలుగులో పాటలు పాడడం అలవాటైంది. పదేళ్ల వయసులోనే ఆలిండియా రేడియోలో పాఠశాల తరఫున పాటలు పాడి మంచి గాయనిగా పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత చదువు పూర్తయ్యాక కర్నాటక శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించి పలు కచేరీలు చేశారు. ఆమె పేరు 'కలైవాణి' అయినా, జయరామ్‌తో వివాహమయ్యాక వాణీజయరామ్‌గా ప్రసిద్ధి చెందారు. పెళ్ళయ్యాక కూడా సినీరంగంలో పాటలు పాడేందుకు జయరామ్ ఎంతో ప్రోత్సాహం ఇవ్వడంతో అనేకభాషల్లో ఆమె అద్భుతంగా పాటలు పాడి అందరి ప్రశంసలు అందుకున్నారు. అభిమానవంతుడు సినిమాలో 'ఎప్పటివలె కాదురా స్వామి' అనే పాట పాడేందుకు దర్శకుడు కోదండపాణి అవకాశం ఇవ్వడం, ఆ పాటను ఆమె అద్భుతంగా పాడడంతో తెలుగుసినీరంగంలో ఆమెకు ఎన్నో అవకాశాలు వచ్చాయి. ఆమె మధురమైన కంఠస్వరం. ఆమెకో వరం. అదే ఆమెను జాతీయస్థాయిలోనూ పాటల రాణిగా నిలబెట్టింది. తెలుగులోనే కాదు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ, మరాఠీ, భోజ్‌పురి, ఒరియా ఇలా 14 భాషల్లో ఆమె పాడిన పాటలు ప్రేక్షకుల చెవుల్లో నేటికీ గింగురుమంటూనే ఉన్నాయి. సినీగాయనిగానే కాక, భక్తిగీతాల గాయనిగా ఆమె పేరు మార్మోగిపోయింది. దాదాపు అయిదు దశాబ్దాల పాటు తనదైన మధురగానంతో ప్రేక్షకలోకానికి వీనులవిందు చేసింది. తన సినీజీవిత ప్రస్థానంలో సుమారు 20వేలకు పైగానే పాటలు పాడడం ఒక రికార్డు. ఎందరో ప్రసిద్ధులైన గాయనీగాయకులతో ఆమె గొంతు కలిపింది. 'ఎన్నెన్నో జన్మల బంధం నీదీ నాదీ' అనే 'పూజ' సినిమాలో పాట తెలుగువారి మదిలో నిలిచిపోయింది. అంతేకాదు, ఆమె ఏ పాట పాడినా అదొక సమ్మోహనగానంగానే మైమరపిస్తుంది. 'ఒక బృందావనం.. సోయగం', 'తెలిమంచు కరిగింది.. తలుపు తీయనా ప్రభూ'.. 'అందెల రవమిది.. పదములదా'.. వంటి ఎన్నో పాటలు సూపర్‌హిట్ లయ్యాయి. శంకరాభరణం చిత్రంలోని 'మానస సంచరరే' గీతానికి వాణీజయరామ్‌కు జాతీయ పురస్కారం లభించింది. స్వాతికిరణంలోని 'ఆనతినీయరా హరా' పాటకు ఉత్తమగాయని అవార్డు వచ్చింది. ఇతరభాషల్లోనూ ఆమె పాడిన పాటలకు అవార్డులు, పురస్కారాలకు లెక్కేలేదు. ఆమె భర్త జయరామ్ 2018లో కన్నుమూశారు. సంగీతరంగానికి ఆమె చేసిన విశేషకృషికి గుర్తింపుగా కేంద్రప్రభుత్వం ఇటీవలే ఆమె 2022 సంవత్సరానికి గాను 'పద్మభూషణ్' అవార్డును ప్రకటించింది. కానీ, దురదృష్టం.. ఆ విశిష్టమైన జాతీయ అవార్డును అందుకోకుండానే ఆమె ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోవడం బాధాకరం!...

## బీజేపీ పాతివ్రత్యానికి భంగం లేకుండా...

# పీకేతో బీజేపీ... టీడీపీతో పీకే!

TDP BJP JANA SENA

ఆంధ్రప్రదేశ్ బీజేపీకి రాజకీయ పాతివ్రత్యం ఎక్కువ. రాజకీయాల్లో విలువలు కాపాడడానికి ఎంత దూరమైనా సోము వీర్రాజు వెళతారు. కుటుంబ పార్టీ అయిన టీడీపీతో బీజేపీ 2014లో పొత్తు పెట్టుకుందిగానీ, 2019లో పెట్టుకోలేదు. టీడీపీకి బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లే 2014లో టీడీపీ గెలిచింది. 2019లో టీడీపీకి బీజేపీ మద్దతు ఇవ్వలేదు. అందుకే టీడీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయింది అనేది బీజేపీ అధ్యక్షుడు వీర్రాజు అభిప్రాయం. బీజేపీ మద్దతు లేనందువల్లనే 23 స్థానాలే టీడీపీ గెలుచుకోగలిగింది. ఏపీలో బీజేపీకి ఉన్న ఓటు షేర్, ప్రజా మద్దతు అంత బలమైనవి.

ఆ బలం, ఓటు షేర్ చూసుకునే... ఏపీ బీజేపీ అధ్యక్షుడు వీర్రాజు ఈమధ్య కాలంలో స్టేట్‌మెంటు మీద స్టేట్‌మెంట్ ఇస్తున్నారు.

'మేం తెలుగుదేశంకు వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వం. ఆ పార్టీతో పొత్తు పెట్టుకోం...' అని నేరుగా, సూటిగా, స్పష్టంగా వీర్రాజు ఎందుకోగానీ చెప్పలేకపోతున్నారు. చెప్పకుండానూ ఉండలేకపోతున్నారు. అందుకే, వైసీపీతో పాటు టీడీపీ అని అర్థం వచ్చేలా ప్రకటనలు ఇస్తున్నారు. మహారాష్ట్ర బీజేపీకి ఈ పట్టింపు ఏమీ లేదు. వంద శాతం కుటుంబ పార్టీ అయిన శివసేనతో బీజేపీ కలిసిమెలసి దశాబ్దాలపాటు చెట్టా పట్టాలు వేసుకు తిరిగింది. వరస కుదిరితే, మళ్ళీ తిరగడానికి సిద్ధం అవుతోంది. మరి, మహారాష్ట్రలో లేని పట్టింపు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఎందుకూ అంటే... చంద్రబాబుపై వీర్రాజుకు ఉన్న ఎలర్జీ అని చెప్పాలి. అందుకే రకరకాల థియరీలను ఆయన బయటకు తీస్తున్నారు అనిపిస్తోంది. అదే సమయంలో వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్టుగా కనపడడానికి కూడా వీర్రాజు చాలా శ్రమ పడుతున్నారు. కానీ, తమ 'మిత్ర'పక్షం అని అప్పుడప్పుడూ బీజేపీ చెప్పుకునే పవన్ కళ్యాణ్... వైసీపీపై నిప్పులు చెరుగుతున్నారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ప్రదర్శిస్తున్న ఈ రాజకీయ వైఖరికి, కేంద్ర బీజేపీ పెద్ద(ల) వైఖరి కూడా ఒక కారణం అయితే కావచ్చు. ఢిల్లీ పెద్దలు టీడీపీకి అంత అనుకూలంగా లేరు అనే భావనే ఇప్పుడు ఏపీ రాజకీయవర్గాల్లో ఉంది. అందుకని, నర మానవుడు ఎవరికీ అర్థం కావడానికి అవకాశంలేని తెలుగు భాషా ప్రయోగంలో...

"ప్రజలతోనే ఫస్టు మా పొత్తు. తరవాతే పవన్‌కళ్యాణ్‌తో....' అని సోము వీర్రాజు ప్రకటించారు. తెలుగు ప్రజలు ఆయనంత తెలివైనవారు కాదు కనుక, ఆ ప్రకటనలోని అంతరార్థాన్ని కొంచెం విడమరిచి చెబితే బాగుండేది.


అయితే, 'కుటుంబ పార్టీలతో పొత్తు పెట్టుకోము' అనే బీజేపీ పాతివ్రత్యానికి ఇబ్బంది రాకుండానే, టీడీపీని ఇరుకునపెట్టే ఓ వ్యూహంపై బీజేపీలో చర్చ జరుగుతున్నట్టు ఓ చిన్న సమాచారం.

పవన్ కళ్యాణ్‌ను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించి, జనసేనతో పొత్తు పెట్టుకుంటుంది. కావాలంటే, జనసేనతో పొత్తు పెట్టుకోవాలని టీడీపీకి బీజేపీ సవాలు విసురుతుంది. టీడీపీ – సీపీఐ, అంబేద్కర్ పార్టీల కూటమి... జనసేనతో పొత్తు పెట్టుకోవాలి.

జనసేనకు ఓ నలభైయ్ సీట్లు వదిలితే, అందులో బీజేపీకి ఓ పది సీట్లు వదలాలి. అంటే, 175 స్థానాలలోనూ 150కి తక్కువ లేకుండా పోటీచేసేందుకు అవకాశం ఉన్న టీడీపీ పాతిక, ముప్పై సీట్లలో పోటీ చేయడానికైనా 'తగిన' అభ్యర్థులను వెతుక్కోవలసిన స్థితిలో ఉన్నవారు ముఖ్యమంత్రి పదవి ఆశిస్తున్నారన్నమాట.

అయితే, ఇప్పటికీ... ఎన్నికల తేదీలు తెలిసే నాటికి... ప్రకాశం బ్యారేజ్ కింద నుంచి కృష్ణా జలాలు చాలా ప్రవహించి, సముద్రంలో కలుస్తాయి.

మన రాజకీయాల్లో ఈరోజు ఉన్న సమీకరణలు రేపు ఉండడం లేదు. నిన్నటి దాకా నెల్లూరు రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసీపీలో ముఖ్యమంత్రి జగన్‌కు వీర విధేయుడు. ఈరోజు చంద్రబాబునాయుడుకు విధేయుడు. వెంకటగిరి ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డి జగన్‌కు విధేయుడు. ఇప్పుడు, ఆయనకు జగన్‌మోహన్‌రెడ్డి ఓ ఆఫ్ట్రాల్. నెల్లూరుజిల్లాలోనే ఇంకో వికెట్ పడే




సూచనలు ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. మేకపాటి చంద్రమోహన్‌రెడ్డి పేరు మీడియాలో గట్టిగానే వచ్చింది.

దీనికి తోడు, వివేకానందరెడ్డి మర్డర్ కేసు ఒకటి 'ఈటీవీ' డైలీ సీరియల్ 'అంత రంగాలు'లాగా నడుస్తూనే ఉంది. దానికి ఇప్పటికిప్పుడు 'శుభం' కార్డు పడే సూచనలు లేవు.

అంత పలుకుబడి, స్థాయి, ఆ ప్రాంతంలో సామాజికాధిపత్యం, అధికారం కలిగిన జగన్ కుటుంబానికి... వివేకా హత్య కేసు ముద్దాయిలలో ఒకరైన దస్తగిరి అనే ఒక డ్రైవర్ పులి మీద పుట్రలా తయారైన తీరు ఆశ్చర్యం కలిగించక మానదు. 'వివేకా హత్య కేసులో నిజాలు త్వరలోనే తెలుస్తాయి. నిజాలు బయటపడే రోజు దగ్గరిలోనే ఉంది. సీబీఐకి జగన్ సహకరించి ఉంటే, వివేకా మర్డర్ కేసు 10 రోజుల్లో తేలిపోయి ఉండేది' అంటూ దస్తగిరి చేసినట్టుగా చెబుతున్న ప్రకటన... మొత్తం ప్రతిపక్ష నేతలు ఈ మూడున్నరేళ్లల్లో జగన్‌కు చేసిన డ్యామేజ్ కంటే కూడా బలమైంది. సీబీఐ దర్యాప్తు 'వేగం'పుంజుకుంది అని దస్తగిరికి నమ్మకం కుదిరింది అని అతను చేసిన ఈ ప్రకటనను బట్టి అంచనా వేయవచ్చు. అది ఎక్కడికి వచ్చి ఆగుతుందో తెలియదు. వీటి నేపథ్యంలో రాష్ట్ర రాజకీయం ఒక్కొక్క అడుగే ఎన్నికల దిశగా పడుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని ఏమి చేయాలి అనే విషయం వీర్రాజుకు, జీవీఎల్ నరసింహారావుకు అర్థం కావడం లేదు. అయితే, వారి నిర్ణయాత్మకతకు కేంద్ర బీజేపీ పెద్దలు విషయాన్ని వదిలేయకపోవచ్చు.

వైసీపీ, టీడీపీ గురించిన లోతైన అవగాహన కేంద్ర పెద్దలు నరేంద్ర మోడీ, అమిత్‌షాకు ఉంది. వారి అవగాహనకు అనుగుణంగా జే.పీ.నడ్డా నిర్ణయం తీసుకుంటారు.

నిజానికి, ఏ రాష్ట్రంలో జరిగే శాసనసభ ఎన్నికల ఫలితాలు అయినా(మన రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు కూడా) ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహించే రాజకీయపార్టీ, ఆ రాష్ట్రంలో పనిచేసే ప్రతిపక్ష పార్టీల పని తీరుపై ఆధారపడి ఉంటాయి. కేరళ ఉదాహరణ తీసుకుంటే... ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి అధికార పక్షాన్ని దించి ప్రతిపక్షాన్ని గద్దె ఎక్కిస్తుంటారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రమేయం గానీ, జోక్యం గానీ ఏమీ కుదరవు. ఈ ఆనవాయితీకి భిన్నంగా... మొన్నీమధ్య కేరళలో జరిగిన ఎన్నికల్లో పినరయి విజయన్ నాయకత్వంలోని సిపిఎం కూటమిని, వరుసగా రెండోసారి కేరళ ఓటర్లు గద్దె ఎక్కించారు. తమిళనాడులో అన్నా డీఎంకేను దించేసి డీఎంకేను గెలిపించారు. కర్ణాటకలో కేంద్ర పెద్దలు ఏం నిర్ణయిస్తారో తెలియదు.

ఆంధ్రప్రదేశ్ విషయం వచ్చేసరికే, కేంద్ర పెద్దల ప్రస్తావన వస్తోంది. ఇక్కడ ఎవరు గెలిస్తే తమకు లాభమో బీజేపీ కేంద్ర పెద్దలు అంతర్గతంగా ముందుగానే డిసైడ్ చేస్తారు.

ఇప్పటికైతే, వైసీపీ... టీడీపీ కూడా కేంద్ర ప్రభుత్వం పట్ల అవసరానికి మించిన సుహృద్భావం ప్రదర్శిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన చట్టబద్ధమైన హామీల వైపు కేంద్రం కన్నెత్తి చూడకపోయినప్పటికీ కేంద్రపెద్దలను నిలదీయలేని పరిస్థితుల్లో ఉంది. కేంద్ర బడ్జెట్ బాగుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. అందుకే, సోము వీర్రాజు లాంటివారు ఈ రెండు పార్టీలతోనూ చెడుగుడు ఆడుకుంటున్నారు.

కేంద్ర పెద్దలు గనుక తమకు వైసీపీయే బెటరనుకుంటే డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఇప్పుడు జిల్లాల్లో పనిచేస్తూ ఉన్న ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు ఎక్కడ ఉన్న వారు అక్కడే ఉంటూ తమ సేవలు అందిస్తారు. వాలంటీర్లు, గృహసారథుల పర్యవేక్షణలో ఎన్నికలు... ఎటువంటి అల్లర్లు లేకుండా... జరుగుతాయి. కేంద్రపెద్దలు తమకు అనుకూలంగా ఉంటారనే భావంలోనే వైసీపీ నేతలు ఉన్నారు.

రాష్ట్ర బీజేపీ నేతలు కూడా అదే అభిప్రాయంతో ఉన్నట్టు కనబడుతోంది.

ఇప్పటికిప్పుడైతే, కేంద్ర ఆలోచనా తీరుపై స్పష్టత లేదనే చెప్పాలి. మరో నాలుగైదు నెలలు గడిస్తే గానీ ఏ సంగతీ చెప్పలేం అంటున్నారు రాజకీయ వైద్యులు. ప్రస్తుతానికి ఏపీ రాజకీయాన్ని వెంటిలేటర్‌పై ఉంచి కేంద్ర బీజేపీ పెద్దలు నడిపిస్తున్నారు.కేంద్రం ఒక నిర్ణయం తీసుకునే దాకా జై సోము వీర్రాజు. ఆయన ఆడింది ఆట, పాడింది పాట.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

### 'పిఎం జిఎస్‌వై' కింద.. రాష్ట్రానికి

# ఎన్ని రహదారులు నిర్మించారు?

**- పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం (పిఎం జిఎస్‌వై) కింద ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని రహదారులను నిర్మించారని ఈనెల 8న పార్లమెంట్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి మాట్లాడుతూ, ఈ పథకం 3వ దశ కింద 3285 కిలోమీటర్ల లక్ష్యాన్ని కేటాయించడం జరిగిందని, ఇందుకుగాను 2314.38 కిలోమీటర్ల మేరకు 299 రోడ్ల పనులను మంజూరుచేశామని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని జిల్లాల వారీగా ఆ వివరాలను కేంద్రమంత్రి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేది నాటికి 192 రోడ్లు, 1,490 కిలోమీటర్లు రోడ్లు నిర్మాణం పూర్తయిందన్నారు. కోవిడ్-19 మహమ్మారి పరిస్థితుల కారణంగా, భారీ వర్షాలు మరియు వరదలు, పంట సీజన్‌లో రోడ్లపై రైతులు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కొనసాగడం వంటి అనేక కారణాల వలన రాష్ట్రంలో అనేక ప్రాజెక్టుల పనుల్లో జాప్యం జరుగుతోందని వివరించారు.

# సర్వేపల్లి నుంచే పోటీచేస్తా

**- మంత్రి కాకాణి**

రెండుసార్లు తనను గెలిపించిన సర్వేపల్లి నియోజకవర్గం నుంచే తాను మళ్ళీ పోటీ చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. సర్వేపల్లిలో కాకాణి ఓటమి ఖాయమని, అందుకే ఈసారి ఆయన వెంకటగిరి నుండి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్న సోమిరెడ్డి విమర్శల నేపథ్యంలో కాకాణి, తాను సర్వేపల్లి నుండే పోటీ చేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 8న వెంకటాచలం మండలంలోని రామదాసు కండ్రిగలో పర్యటించిన సందర్భంగా కాకాణి ఈ వాఖ్యలు చేశారు.

# డిజిపిని కలిసిన ఎంపీ ఆదాల



ఇటీవల అమరావతిలో రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డిని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరు విషయాలపై ఆయనతో ఆదాల కాసేపు ముచ్చటించారు.

# పేదపిల్లలకు.. గొప్ప చదువులు

**విదేశీ విద్యాదీవెనతో ప్రభుత్వం చేయూత**

గొప్పింటి బిడ్డలకే సొంతమైన విదేశీ విద్యను ప్రతిభా పాటవాలు కల్గిన పేద, బడుగు, బలహీన వర్గాలకు కూడా అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'విదేశీ విద్యా దీవెన' పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు విద్యార్థులకు సూచించారు. ఇటీవల తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి 'జగనన్న విదేశీ విద్యా దీవెన' కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించగా, నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిభ ఉన్నప్పటికీ పేదరికంవల్ల తాము విదేశీ విద్యను చదవలేకపోయామనే బాధ ఇకపై ఏ పేద విద్యార్థికి కలుగకూడదనే ఉన్నత ఆశయంతో ఈ పథకం ప్రవేశ పెట్టారని, విద్యార్థులకు అవసరమయ్యే విమాన ప్రయాణం, వీసా, అడ్మిషన్ ఖర్చులను ప్రభుత్వం భరించడమేకాక, నాలుగు విడతలుగా ఫీజులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించాలని కోరిక ఉన్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని జిల్లాకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి జగనన్న విదేశీ విద్య మొదటి విడత నగదును బటన్ నొక్కి జమ చేశారు. జిల్లా నుంచి విదేశాల్లో విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసుకున్న 8 మంది విద్యార్థులకు మొదటి విడతగా రూ.63,78,693ల మెగా చెక్కును కలెక్టర్, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కనకదుర్గ భవాని, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, కృష్ణ కిషోర్, ఆసిఫా తదితరులు పాల్గొన్నారు.

# ధనుంజయరెడ్డి స్థానంలో.. ధనుంజయరెడ్డి!



- 'కొడవలూరు'కు బదులు 'మెట్టుకూరు'
- రసకందాయంలో ఉదయగిరి రాజకీయాలు

ఉదయగిరి నియోజకవర్గంలో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పలువురికి ముఖ్యమైన బాధ్యతలు అప్పగిస్తూ వైకాపా అధినేత.. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో ఉదయగిరి రాజకీయాలు మలుపులు తిరుగుతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గ పార్టీ పరిశీలకునిగా మొన్నటిదాకా ఉన్న కొడవలూరు ధనుంజయరెడ్డిని ఆ బాధ్యతల నుండి తప్పించారు. నియోజకవర్గంలో ఆయన కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నాడంటూ ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపిన విషయం తెలిసిందే. దీంతో... ఆ స్థానంలో మెట్టుకూరు ధనుంజయరెడ్డిని ఈనెల 7న ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకునిగా పార్టీ అధిష్టానం నియమించడం మరింత సంచలనాత్మకమైంది. ఇటీవల సిఎంను కలసిన మెట్టుకూరుకు ఈ బాధ్యతలు అప్పజెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### మెట్టుకూరుకు పరిశీలక బాధ్యతలు

మెట్టుకూరు ధనుంజయరెడ్డికి వివాద రహితుడనే మంచిపేరుంది. గతంలో నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షునిగా పనిచేసినప్పుడు కూడా ఆయన ఆ మంచిపేరును నిలబెట్టుకున్నారు. అంతేకాదు, బల్లి దుర్గాప్రసాద్ ఆకస్మిక మరణంతో వచ్చిన తిరుపతి ఉపఎన్నిక సమయంలో వెంకటగిరి ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా కూడా ఆయన బాధ్యతలు నెరవేర్చారు. వాస్తవానికి గత ఎన్నికల్లోనే ఆయనకు ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం కల్పించాలన్న ఆలోచనలు కూడా పార్టీ అధిష్టానానికి ఉండేవని, కానీ అప్పట్లో పార్టీ ప్రాధాన్యతల దృష్ట్యా మెట్టుకూరుకు అవకాశం రాలేదని తెలుస్తోంది. అయినప్పటికీ మెట్టుకూరు అలగకుండా పార్టీని, ముఖ్యంగా జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకుని పనిచేస్తున్నారు. నెల్లూరు కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్‌గా వరుసగా రెండుసార్లు ఎన్నికైన మెట్టుకూరు నిబద్ధతతో పనిచేసే నాయకుడన్న విషయం పార్టీ అధిష్టానం ఎప్పుడో గుర్తించిందని, అందుకే, సిఎం జగన్‌ను కలసినప్పుడల్లా 'వచ్చే ఎన్నికల్లో మీకు తప్పకుండా అవకాశం ఉంటుందని' మెట్టుకూరుకు భరోసా ఇచ్చేవారని భోగట్టా. ఉదయగిరి నాయకుల విభేదాలను సమసిపోయేలా చేయడమే లక్ష్యంగా మెట్టుకూరును నియమించడం, తద్వారా ఆయనకు పార్టీ నుంచి సరైన ప్రాధాన్యత కల్పించడం.. అలా రెండువిధాలా ఆలోచించి పార్టీ అధిష్టానం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అకస్మాత్తుగా అస్వస్తతకు గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కోలుకుని రాగానే మెట్టుకూరు ఉదయగిరి పరిశీలక బాధ్యతలు చేపడతారని సమాచారం.

# శీనయ్య పేరు సార్థకం!



- నెల్లూరు బ్యారేజీకి..నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు
- మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్
- మంత్రి మండలి ఆమోదంతో సర్వత్రా ప్రజల హర్షం



ఎవరికీ తలవంచని ధీరుడు..నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తిరుగులేని వీరుడు.. అసెంబ్లీ టైగర్.. దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు సార్థకమైంది. జిల్లా రాజకీయాల్లో అగ్రనేతగా రాణిస్తూ, జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు, రైతాంగానికి సాగునీటి కొరతలేకుండా చేసేందుకు శీనయ్య చేసిన కృషి అపూర్వం.. అనన్య సామాన్యం. ప్రజలన్నా, రైతులన్నా, పేదలన్నా ఆయనకెంతో అభిమానం. అందుకే ఆయన ప్రజానాయకునిగా కీర్తినందుకున్నారు. రాజకీయాల్లో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ధైర్యంగా నిలబడడం, ఎన్ని కష్టాలొచ్చినా సరే రాజకీయాల్లో రాజీపడకుండా పోరాడడం, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతదూరమైనా వెళ్ళడం ఆయన నైజం. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఏ పదవిలో ఉన్నా ఆ పదవిలో రాణించే నేతగా ఆయన ప్రసిద్ధి. ఏ పార్టీలో ఉన్నా.. పార్టీలకు అతీతంగా ఆయన ప్రజల సేవకు అంకితమయ్యేవారు. ఆయన హయాంలో జిల్లాకు ఎన్నో సాగునీటివనరులు వచ్చాయి. ఎన్నో సంక్షేమపథకాలు ప్రజలకు చేరువయ్యాయి. అందుకే శీనయ్యంటే జిల్లా ప్రజలకు ఎంతో అభిమానం. మళ్ళీ ఇంత కాలం తర్వాత దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు జిల్లాలో మారుమోగుతోంది. జిల్లా రైతుల కోసం ఆయన చేసిన మహోన్నత సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఆయన పేరు కలకాలం గుర్తుండే విధంగా నెల్లూరు బ్యారేజీకి 'నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీ'గా నామకరణం చేస్తామని చెప్పడం, చెప్పిన మాట నిలబెట్టుకుంటూ తాజాగా ఈనెల 8న ముఖ్యమంత్రి చొరవతో రాష్ట్ర మంత్రి మండలి ఆమేరకు నామకరణం చేసేందుకు చేసిన తీర్మానానికి అమోదం తెలపడంతో జిల్లా ప్రజలు, రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

నెల్లూరు నగరంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం సమీపంలో పెన్న ఒడ్డున కొత్తగా నిర్మించిన పెన్నా బ్యారేజీకి ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత ముత్తుకూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి, నెల్లూరు బ్యారేజీ విషయాన్ని ప్రస్తావిస్తూ, బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టనున్నట్లు ప్రకటించినప్పుడు ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం (ఫిబ్రవరి 8) రోజున జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఆ మేరకు చేసిన తీర్మానానికి ఆమోదం లభించడంతో జిల్లా ప్రజలు 'శీనయ్య పేరు సార్థకమైందంటూ' సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### సిఎంకు.. ప్రసన్న కృతజ్ఞతలు



చరిత్రాత్మకమైన ఈ కార్యం తమకెంతో సంతోషం కలిగిస్తోందని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనయుడు, కోవూరు ఎమ్మెల్యే.. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, తమ తండ్రిపేరును సార్థకం చేసినందుకు, ఆ మేరకు తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలికి, అందుకు కృషిచేసిన జిల్లా ప్రజాప్రతినిధులకు అందరికీ ధన్యవాదాలని ఆయన పేర్కొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com